సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 1-12-2023 15/-



# తెలంగాణ ఓటెవరికి?



భవితను నిర్ణయించే
వజ్రాయుధం: ఓటుహక్కు



ప్రజాభిప్రాయం ఎలా మారుతుంది?
ఒక ఉదాహరణ

సహజీవన భావనల పావురాయి
# గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**



Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in



సంపుటి 45 సంచిక: 48 హైదరాబాద్
శుక్రవారం 1 డిసెంబర్ 2023 రూ.15-00
16 జమాదిఉల్ ఊలా 1445 హిజ్రీ


**తొలిగీటు**

"మీలో ఎవరయితే ఉత్తమ గుణగణాలు గలవారో వారే ఇస్లాం అనుసరణలోనూ ఉత్తములు. అయితే వారికి ధర్మావగాహన ఉండాలి."

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**





**యుద్ధజ్వాలల్లో మసిబారుతున్న బాల్యం**

## లోపల...


| | |
|---|---|
| న్యాయం ...... | 04 |
| తెలంగాణ ఓటెవరికి? ...... | 05 |
| నిర్ధారణాగ్రేసరుడు మహనీయ అబూ బక్ర్ (రజి)-7 ...... | 09 |
| భవితను నిర్ణయించే వజ్రాయుధం: ఓటుహక్కు ...... | 12 |
| ప్రణాళిక తప్పనిసరి ...... | 14 |
| రక్షణలేని గాజాను నాశనం చేస్తున్న ఇస్రాయీల్ ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) ...... | 18 |
| అడుగుజాడలు ...... | 19 |
| మూఢనమ్మకాల అంధకార లోయల్లో అరబ్బులు-2 ...... | 20 |
| చరితార్థులు-2 : మౌలానా ఫజల్-ఎ-హఖ్ ఖైరాబాది ...... | 23 |
| ప్రజాభిప్రాయం ఎలా మారుతుంది? ఒక ఉదాహరణ ...... | 24 |
| మగువ మనుగడ ...... | 32 |
| ఒక్క బియ్యం గింజతో... ...... | 34 |


**కాస్త మంచోడికి ఓటెయ్యన్నా.!!**




కులం ధనం కాదురా
అభ్యర్ధి గుణం మిన్న
మంచితనమే చూడు
యెవరు యెన్ని అన్న!
నోటుకు నువ్వోటేస్తే
మిగిలేది నీకు సున్న
నీ మేలుకె చెబుతున్న
వినుకోరా మాయన్న!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

ఆలోచన

# న్యాయం

**హమాస్ సాయుధులు** ఇస్రాయీల్‌పై దాడి చేశారు. ఈ దాడిలో అమాయకులు మరణించారు. కొందరిని సాయుధులు నిర్బంధించి తీసుకుపోయారు. ఈ దాడి తర్వాత ఇస్రాయీల్ హమాస్‌ను తుడిచేస్తామంటూ గాజాపై దాడులు మొదలు పెట్టింది. గాజా దాడుల్లో 12 వేల మందికి పైగా మరణించారు. ఇందులో సగానికి పైగా పిల్లలు, పసిపిల్లలు, మహిళలున్నారు. వీళ్ళల్లో ఎవ్వరు కూడా హమాస్ సాయుధులు కారు. మిగిలిన సగంలోను చాలా మంది ముసలివారు, రోగులున్నారు. వారు కూడా హమాస్ సాయుధులు కారు. నిజానికి ఇస్రాయీల్ దాడుల్లో మరణించిన వారంతా అమాయక ప్రజలు. హమాస్ సాయుధులను అంతం చేశామని ఇంత వరకు ఇస్రాయీల్ చెప్పుకోలేకపోయింది. ఆసుపత్రులపై దాడులు చేసి పసిపిల్లలను చంపిన హంతక రాజ్యం ఆసుపత్రుల్లో హమాస్ స్థావరాలున్నాయని నిరూపించడానికి చేసిన ప్రయత్నాల్లో డొల్లతనాన్ని అనేకమంది విశ్లేషకులు బయటపెట్టారు. గాజాపై ఇస్రాయీల్ దాడులకు వంతపాడుతున్న అమెరికా కూడా ఇందులో హంతకపాత్ర పోషిస్తోంది. ఇస్రాయీల్, అమెరికాల వైఖరిని ఇప్పుడు యావత్తు ప్రపంచం అసహ్యించుకుంటోంది. ఖండిస్తోంది. ఈ యుద్ధంలో ఇస్రాయీల్ గెలిచే అవకాశాలు లేవని చాలా మంది వాదించడంలో నిజమూ ఉండవచ్చు. కాని, గాజాలో పసిపిల్లలను హతమారుస్తున్న ఇస్రాయీల్‌ను అంతర్జాతీయ న్యాయస్థానంలో శిక్షించడం సాధ్యపడుతుందా?

ఇస్రాయీల్‌ను అరబ్బు దేశాల మధ్య ఏర్పాటు చేసింది అమెరికా. కాని అమెరికా ఇప్పుడు ఇస్రాయీల్ చేతిలో ఆటబొమ్మగా ఎలా కీ ఇస్తే అలా ఆడుతోంది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ న్యాయస్థానంలో పసిపిల్లల హంతకులకు శిక్ష పడుతుందని ఆశించగలమా? అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేసింది. అంతర్జాతీయ న్యాయస్థానంలో అమెరికా, ఇస్రాయీల్ దేశాలు సభ్య దేశాలు కావు. ఇస్రాయీల్ అంతర్జాతీయ చట్టానికి తూట్లు పొడవడం అనేది ఇదే మొదటిసారి కాదు. ఎన్నడూ ఇస్రాయీల్‌ను నిలదీసిన వాడెవ్వడూ లేడు. ఇస్రాయీల్ చేస్తున్న హత్యలను ఎవరు ఎంతగా ఖండించినా, ఈ నేరాలకు శిక్ష పడడం సాధ్యపడే పరిస్థితే కనిపించడం లేదు. నేరాలకు శిక్షలు పడకపోతే న్యాయం ఎలా జరుగుతుంది? న్యాయం జరగనిదే శాంతి సాధ్యం కాదు.

ఇస్రాయీల్ అంతర్జాతీయ న్యాయస్థానంలో సభ్యదేశం కాకపోయినప్పటికీ, ఇస్రాయీల్ ప్రధాని నెతన్యాహుపై అంతర్జాతీయ న్యాయస్థానంలో కేసు నడవవచ్చు. ఈ కేసును నెతన్యాహు వ్యతిరేకిస్తాడు. అమెరికా నెతన్యాహుకు వంతపాడుతుంది. సుదీర్ఘ విచారణ జరగవచ్చు. నెతన్యాహుపై విచారణ జరపాలని ఇప్పటికే టర్కీ ధరఖాస్తు చేసింది. యుద్ధ నేరాలకు విచారణ జరిపి శిక్షించాలని కోరుతోంది. కొలంబియా, అల్జీరియా, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, బొలివియా ఇలా ఎన్ని దేశాలు, చివరకు ప్రపంచంలోని దేశాలన్నీ కలిసి కోరినా అమెరికా అడ్డుకుంటే నెతన్యాహును విచారించడం సాధ్యం కాదు. ఇస్రాయీల్ ఒక్కసారి కూడా విచారణకు హాజరు కాదు. పాలస్తీనాలో అమానుషాలను కొనసాగిస్తూనే ఉంటుంది.

హమాస్‌ను తుడిచేస్తామంటూ నిరాయుధులను, ఆసుపత్రుల్లో ఉన్న పసిపాపలను హతమార్చి యుద్ధం చేస్తున్నామంటూ చెప్పుకునే దేశం చివరకు సాధించేదేముంటుంది? అఫ్గనిస్తాన్‌లో తాలిబాన్లను తుడిచేస్తామంటూ 2001లో ఇలాగే అమెరికా యుద్ధం ప్రారంభించింది. తర్వాత తాలిబాన్లు మరింత బలపడ్డారు. ఇప్పుడు అఫ్గనిస్తాన్‌లో అదే తాలిబాన్ ప్రభుత్వం నడుస్తోంది. అమెరికాలోని బడా ఆయుధ వ్యాపారులు దండిగా సంపాదించుకునే అవకాశాలు పొందారు. ఇరాక్‌లో రసాయనిక ఆయుధాలున్నాయని అమెరికా యుద్ధం చేసింది. ఇప్పుడు అదే ఇరాక్ పాలస్తీనా విషయంలో అమెరికాతో తలపడేలా కనిపిస్తోంది. ఇస్రాయీల్ హమాస్‌ను తుడిచేసిందా? నలభై రోజులకు పైబడిన యుద్ధంలో బాంబుల వర్షాలు కురిపించి అమాయకులను చంపడమా యుద్ధమంటే? ఇలాంటి యుద్ధం హమాస్‌ను మరింత బలపడేలా చేయడం లేదా? ఈ అమానుష అణిచివేతలు కొనసాగడం, యుద్ధం పేరుతో హత్యాకాండ కొనసాగించటం, ఈ యుద్ధనేరాలకు శిక్షలు పడకపోవడం ఇలాగే కొనసాగితే హింసాకాండల విషవలయం కొనసాగుతూనే ఉంటుంది. న్యాయాన్ని కాపాడలేకపోయినప్పుడు శాంతిని సాధించడం కష్టం. అందుకే దివ్యఖుర్‌ఆన్ స్పష్టంగా చెప్పింది.

“విశ్వసించిన ప్రజలారా! న్యాయధ్వజవాహకులుగా నిలబడండి. అల్లాహ్ కొరకు సాక్షులుగా ఉండండి. మీ న్యాయం, మీ సాక్ష్యం మీకూ, మీ తల్లిదండ్రులకూ, మీ బంధువులకూ ఎంత హాని కలిగించినా సరే. కక్షిదారులు భాగ్యవంతులయినా, నిరుపేదలయినా అల్లాహ్ వారి శ్రేయస్సును మీకంటే ఎక్కువగా కాంక్షిస్తాడు. కనుక మీ మనోవాంఛలను అనుసరిస్తూ న్యాయం నుండి వైదొలగకండి. మీరు గనక సాక్ష్యాన్ని వక్రీకరిస్తే, న్యాయాన్ని దాటవేస్తే, బాగా తెలుసుకోండి, మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు అని.”

*(దివ్యఖుర్‌ఆన్: 4:135)*

అబ్దుల్ వాహెద్



# తెలంగాణ ఓటెవరికి?

జమాఅతె ఇస్లామీ హింద్ తెలంగాణ శాఖ ఈ ఎన్నికల్లో తన మద్దతు ఎవరెవరికో ప్రకటించింది. పార్టీల ప్రాతిపదికన కాకుండా, అభ్యర్థుల ప్రాతిపదికన వివిధ నియోజక వర్గాల్లో విభిన్న పార్టీలకు చెందిన అభ్యర్థులకు మద్దతు ప్రకటించారు. మొత్తం 119 నియోజక వర్గాల్లో 41 చోట్ల బీఆరెస్ పార్టీ అభ్యర్థులకు జమాఅత్ మద్దతిస్తోంది. మిగిలిన నియోజక వర్గాల్లో 69 చోట్ల కాంగ్రెసు అభ్యర్థులకు జమాఅత్ మద్దతిస్తోంది. మజ్లిస్ పార్టీకి చెందిన 7 గురు అభ్యర్థులు జమాఅత్ మద్దతు పొందారు. బియస్పీ, వామపక్షాలకు చెందిన ఒక్కో అభ్యర్థికి మద్దతు ప్రకటించడం జరిగింది.

గతంలో జరిగిన వివిధ ఎన్నికల్లో కూడా జమాఅత్ వ్యక్తిగతంగా అభ్యర్థుల పనితీరు ప్రాతిపదికన మద్దతు నిర్ణయం తీసుకోవడం అనేకసార్లు జరిగింది. ఈ సారి తీసుకున్న నిర్ణయంలోను కొల్లాపూరులో ప్రశ్నించే స్వరం బర్రెలక్కకు జమాఅత్ మద్దతు ప్రకటించడం గమనార్హం. జమాఅత్ తీసుకున్న నిర్ణయం యావత్తు ముస్లిం సమాజాన్ని ప్రభావితం చేస్తుందన్నది పలుమార్లు రుజువైన విషయం. జమాఅత్ మద్దతు 69 మంది కాంగ్రెసు అభ్యర్థులకు లభించడం ఈ ఎన్నికల్లో కీలకాంశంగా మారే అవకాశాలున్నాయి. ఈ 69 నియోజక వర్గాల్లో కాంగ్రెసు గెలుపు అవకాశాలు పెరిగాయి. అలాగే జమాఅత్ మద్దతిచ్చిన 41 మంది బీఆరెస్ అభ్యర్థుల గెలుపు అవకాశాలు కూడా బాగా పెరిగాయి.

మరోవైపు లోక్‌పాల్ మెగా సర్వే వచ్చింది. రాష్ట్రంలో కాంగ్రెసు గాలి బలంగా వీస్తున్నట్లు ఈ సర్వే చూస్తే అర్థమవుతుంది. ముఖ్యంగా రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రతో కాంగ్రెసు బలం పుంజుకుంది. లోక్ పాల్ సర్వే చూస్తే కాంగ్రెసు ఓట్లశాతం

43 నుంచి 46 వరకు పెరిగేలా ఉంది. దాదాపు 69 నుంచి 72 సీట్లు గెలుచుకునేలా ఉంది. అధికారపక్షానికి ఇది కాస్త ఇబ్బందికరమైన పరిస్థితే. ఈ సర్వే ప్రకారం బీఆరెస్ 36 నుంచి 39 స్థానాలు పొందవచ్చు. అంటే బీఆరెస్ భారీగా నష్టపోయే పరిస్థితి. కాగా బీఆరెస్– కాంగ్రెస్ మధ్య ముస్లిముల ఓట్లు చీలడం వల్ల బీజేపీ కొంతమేర ప్రయోజనం పొందే పరిస్థితి కూడా ఉంది. గతంలో ఒకే ఒక్క స్థానంలో గెలిచిన బీజేపీ ఈసారి రెండు స్థానాలు సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయని అంచనా. బీఆరెస్ మిత్రపక్షం మజ్లిస్ గెలిచే స్థానాలు కూడా తగ్గుతాయా? మజ్లిస్ కంచుకోటగా పేరుపడిన 7 స్థానాలు తిరిగి కైవసం చేసుకుంటుందా? ఎన్నికల ఫలితాల తర్వాతే చెప్పగలం. ఇంతకు ముందు వచ్చిన సి వోటర్ సర్వే కూడా తెలంగాణలో కాంగ్రెస్ గాలి బలంగా వీస్తున్నట్లే చెప్పింది. దాదాపు 43 నుంచి 55 స్థానాల్లో కాంగ్రెసు గెలిచే అవకాశా లున్నట్లు సి వోటర్ సర్వే చెప్పింది. సర్వేలు కాంగ్రెసు పునరాగ మనాన్ని సూచిస్తున్నాయి.

ఈ ఎన్నికల్లో ముస్లిం ఓట్లు చాలా ప్రాముఖ్యం సంతరించు కున్నాయి. కాంగ్రెసు పార్టీ ఈ వాస్తవాన్ని ముందే గుర్తించింది. బీఆరెస్ చాలా ఆలస్యంగా గుర్తించిందని చెప్పాలి. గత ఎన్నికల్లో ముస్లిములు రాష్ట్రంలో బీఆరెస్ పక్షాన బలంగా నిలుచున్నారు. ఈ సారి కూడా ముస్లిం మద్దతు తమకే లభిస్తుందన్న ధీమాతో నిర్లక్ష్యం చేసిన బీఆరెస్ ఇప్పుడు మూల్యం చెల్లించుకునే పరిస్థితి వచ్చింది. రాష్ట్రంలోని 40 నియోజక వర్గాల్లో ముస్లిం ఓట్లు గెలుపోటములను నిర్ణయించే స్థాయిలో ఉన్నాయి. రాష్ట్రంలోని 3.26 కోట్ల మంది ఓటర్లలో 13 శాతం ముస్లిములున్నారు. బీఆరెస్ వరుసగా రెండు సార్లు గెలుపొందడం వెనుక కూడా ముస్లిముల ఓట్లే కీలకపాత్ర పోషించాయి. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ముస్లిములు పెద్ద స్థాయిలో పాలుపంచు కున్నారు. వివిధ ముస్లిం సంఘాలు, సంస్థలు తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమంలో పోరాడాయి. జమాఅతె ఇస్లామీ హింద్ తెలంగాణ ఉద్యమంలో అగ్రభాగాన నిలిచింది. ఉద్యమ పార్టీగా అప్పట్లో టీఆరెస్‌గా ఉండిన బీఆరెస్‌కు సహజంగానే అన్ని వర్గాల మద్దతు లభించింది. ముస్లిములు కూడా బీఆరెస్ పక్షానే నిలిచారు. ఆ తర్వాత జరిగిన 2018 ఎన్నికల్లో కూడా ఉద్యమ పార్టీగా బీఆరెస్ ప్రాభవం కొనసాగింది. జమాఅత్ అప్పట్లో బీఆరెస్‌కు తన మద్దతు ప్రకటించింది. ఈ సారి హ్యాట్రిక్ సాధిం చాలనుకున్న బీఆరెస్ మరోసారి అన్ని వర్గాల ఓట్లు తనకు లభిస్తాయని భావిస్తోంది. ముస్లిముల ఓట్లు కూడా తప్పక తమకే లభిస్తాయని బీఆరెస్ నాయకులు భావిస్తున్నారు. కాని మారిన పరిస్థితుల్లో ముస్లిం ఓట్లు కాంగ్రెసు వైపు మొగ్గు చూపడం ప్రారంభమయ్యింది. దీనివల్ల బీఆరెస్, కాంగ్రెసు మధ్య ఓట్లు చీలిపోయే పరిస్థితి తలెత్తింది.

కాంగ్రెసు కర్నాటకలో సాధించిన విజయాన్ని తెలంగాణలో కూడా సాధించాలనుకుంటోంది. కాని కర్నాటకకు, తెలంగాణకు మధ్య తేడా ఉంది. కర్నాటకలో ప్రాంతీయపార్టీ ఏదీ రంగంలో లేదు. కర్నాటకలో ముస్లిములకు కాంగ్రెసు ఒక్కటే మతతత్వం నుంచి కాపాడే పార్టీ. కర్నాటకలో బీజేపీ తీసుకున్న నిర్ణయాలు, హిందూత్వ ఎజెండా, హిజాబ్ నిషేధం, హలాల్‌పై వివాదం, లవ్ జిహాద్ వివాదాలు ముస్లిము ఓట్లన్నీ ఎలాంటి చీలిక లేకుండా కాంగ్రెసుకు పోలయ్యే వాతావరణాన్ని సృష్టించాయి. మజ్లిస్ పార్టీ అక్కడ అడుగుపెట్టడానికి ప్రయత్నించింది. అలాగే ముస్లిం పార్టీగా సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా కూడా రంగంలోకి దిగింది. ఓట్లు చీలిపోయే పరిస్థితి కొంతవరకు వచ్చింది. కాని ఓట్లు చీలిపోకుండా కర్నాటక ముస్లిములు ఈ ప్రయత్నాలను తిప్పికొట్టారు. కాంగ్రెసుకు విజయం వరించింది. కర్నాటకలో మజ్లిస్, యస్డిపీఐ పార్టీలు పెద్ద పార్టీలేమీ కాదు. కాబట్టి ఈ పార్టీలు ముస్లిం ఓట్లను చీల్చడం సాధ్యమూ కాలేదు. కానీ తెలంగాణ పరిస్థితి వేరు. ఇక్కడ సెక్యులర్ పార్టీగా బీఆరెస్ బలమైన పార్టీ మాత్రమే కాదు, అధికార పక్షం కూడాను. కాంగ్రెసు పార్టీ దేశవ్యాప్తంగా బీజేపీకి ప్రత్యామ్నయంగా, దేశంలో మతవిద్వేష వాతావరణాన్ని తొలగించి సామరస్య వాతావరణం కోసం పోరాడుతున్న నేతగా రాహుల్ గాంధీ బలమైన ఇమేజ్ సంపాదించారు. కాంగ్రెసు, బీఆరెస్ రెండూ రంగంలో ఉండడం వల్ల ముస్లిం ఓట్లు చీలిపోయే పరిస్థితిని కాదనలేము.

బీఆరెస్ సెక్యులర్ ఇమేజ్ బలంగా ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి బీఆరెస్ పాలిస్తోంది. ఈ పదేళ్ళ పాలనా కాలంలో ఎన్నడూ మతఘర్షణలు జరగలేదు. తెలంగాణలో మూకహత్యలు, మూకదాడులు, హిజాబ్ వివాదాలు, హలాల్ వివాదాలు, లవ్ జిహాదు గగ్గోళ్ళు లేవు. పైగా హైదరాబాదులో బలమైన మజ్లిస్ పార్టీ బీఆరెస్ కు మిత్రపక్షం. మరోవైపు ముస్లిం యునైటెడ్ ఫోరం అనే సంస్థ కూడా బీఆరెస్‌కు మద్దతు ప్రకటిం చింది. ఇవన్నీ సానుకూలాంశాలు కాబట్టి ముస్లిం ఓట్లు తమవైపే ఉంటాయని బీఆరెస్ భావిస్తోంది.

మతఘర్షణలను సమర్థవంతంగా అదుపు చేయడమే బీఆరెస్

ముఖ్యంగా ముస్లిములకు చేసిన మేలుగా భావించాలి. పదేళ్ళలో మైనారిటీల కోసం 12,780 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని, మైనారిటీల సంక్షేమ బడ్జెటును 2,200 కోట్ల రూపాయలకు పెంచామని, మైనారిటీలకు రెసిడెన్షియల్ స్కూళ్ళు కట్టించామని, అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని బీఆరెస్ చెబుతున్నప్పటికీ ముస్లిముల ఓట్లు పొందడానికి ముఖ్యంగా ఆధారపడుతున్నది మతఘర్షణలు లేని పాలన అందించామన్న వాదనపైనే. గంగా జమునా తహజీబ్ గురించి బీఆరెస్ అగ్రనేతలు తరచు తమ ప్రసంగాల్లో మాట్లాడుతున్నారు. ఇది చాలా జాగ్రత్తగా గమనించవలసిన వాదన. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాల కాలం గడిచిపోయినా ఇప్పటికి కూడా ముస్లి ములు తమ ప్రగతి వికాసాల కన్నా ఎక్కువగా తమ భద్రతకు ప్రాముఖ్యం ఇవ్వవలసిన పరిస్థితులున్నాయి. ఈ పరిస్థితి ఇప్పటి తరం ముస్లిము యువతకు ఇష్టం లేదు. అందరితో పాటు ప్రగతి వికాసాల్లో పోటీ పడాలని వారు భావిస్తున్నారు. ఉన్నత చదువు లతో ముందుకు పురోగమించాలనుకుంటున్నారు. హిందూ ముస్లిం రాజకీయాలతో బీజేపీ దేశంలో ఎదగాలని భావిస్తుంటే, భద్రత కల్పిస్తే చాలు అనుకునే పరిస్థితిలో మాత్రమే ముస్లిములు ఉండాలని మరికొన్ని పార్టీలు భావిస్తున్న పరిస్థితికి ఈ ఎన్నికల ప్రచారం దర్పణం పడుతోంది. కేంద్రంలో బీజేపీ తీసుకున్న అనేక నిర్ణయాల విషయంలో బీఆరెస్ మెతకవైఖరి కూడా ముస్లిముల దృష్టిలో ఉంది. ఈ నేపథ్యంలో 'ముహబ్బత్ కి దుకాన్' నినాదంతో ముందుకు వచ్చిన రాహుల్ గాంధీ ఈ ఎన్నికల్లో ప్రత్యేక ఆకర్షణ అయ్యారు. జమీఅతె ఉలమా, తెహ్రీక్ ముస్లిం షబ్బాన్ వంటి సంస్థలు కాంగ్రెసుకు మద్దతు ప్రకటిం చాయి.

బీఆరెస్ ఎన్నడూ బీజేపీని వ్యతిరేకించలేదని, కేవలం రాష్ట్ర స్థాయిలో మాత్రమే బీజేపీ పట్ల వ్యతిరేకత చూపిస్తుందని, కేంద్రంలో బీఆరెస్ ఎల్లప్పుడూ బీజేపీ నిర్ణయాలకు వత్తాసు పలుకుతుందన్న అభిప్రాయం కూడా వినిపిస్తోంది. బీఆరెస్, మజ్లిస్ పార్టీలు బీజేపీతో కుమ్మక్కయ్యాయని కాంగ్రెసు ఆరోపిస్తోంది. కాంగ్రెసుకు, బీజేపీకి ముఖాముఖి పోటీ ఉన్న రాష్ట్రాల్లో మజ్లిస్ తన అభ్యర్థులను రంగంలోకి దింపడం కూడా అనేకసార్లు విమర్శలకు తావిచ్చింది. బీజేపికి ప్రయోజనాలు చేకూర్చడానికే ఈ పని చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపించాయి.

మరోవైపు కాంగ్రెసు బలమైన దాడి చేస్తోంది. 12 శాతం రిజర్వేషన్లేమయ్యాయి? 4 శాతం రిజర్వేషన్లు కూడా కల్పించింది కాంగ్రెసు పార్టీయే. ఈ రిజర్వేషన్ల వెనుక బీఆరెస్ ప్రయత్నాలేవీ లేవు అంటూ కాంగ్రెసు నాయకుడు ముహమ్మద్ అలీ షబ్బీర్ నిలదీస్తున్నారు. ముహమ్మద్ అలీ షబ్బీర్ వంటి సీనియర్ ముస్లిం నాయకుడు కాంగ్రెసులో ఉన్నాడు. అలాంటి స్థాయి ఉన్న ముస్లిం నేతలెవ్వరు బీఆరెస్ లో కనిపించడం లేదు. మైనారిటీల బడ్జెటు పెంచామని చెబుతున్నప్పటికీ బడ్జెటులో 60 శాతం ఖర్చు చేయడం లేదని కాంగ్రెసు నేతలు విమర్శిస్తున్నారు. అలాగే ఉద్యోగాల కల్పన, పేదలకు నివాసగృహాల పంపిణీ వంటి అనేక అంశాల్లో బీఆరెస్ వైఫల్యాలను కాంగ్రెసు నిలదీసి ప్రశ్నిస్తోంది.

తెలంగాణలో దాదాపు 13 శాతం ముస్లిం ఓటర్లున్నారు. ఇక్కడ మజ్లిస్ పార్టీ ముస్లిం ప్రధానమైన పార్టీ. మజ్లిస్ అగ్రనాయకత్వంలో అందరూ ముస్లిములే. మజ్లిస్ బలం కేవలం హైదరాబాదుకు మాత్రమే పరిమితం. రాష్ట్రంలో పోటీ పడుతున్న ప్రధాన పార్టీలు బీఆరెస్, కాంగ్రెసులు. ఈ రెండు పార్టీలకు ముస్లిముల ఓట్లు కావాలి. పోటీ పడుతున్న మరో పార్టీ బీజేపీ. బీజేపీకి ముస్లిముల ఓట్లు అక్కర్లేదు, అందుకే బాహాటంగా తాము అధికారంలోకి వస్తే ముస్లిములకు లభిస్తున్న 4 శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రకటించారు. కాని ముస్లిముల

## నమ్మినా నమ్మకపోయినా ? 11

### వైవిధ్యం నుంచే ఆశయసిద్ధి కలుగుతుంది

మోటారు వాహనం సజావుగా నడవటానికి పరస్పర విరుద్ధమైన రెండు భాగాల తోడ్పాటు అవసరం ఉంటుంది. అదే ఒకటి పిస్టన్ మరొకటి సాకెట్. ఈ రెండు భాగాలు కలసి, తమ తమ పనితీరు ద్వారా వాహనం ముందుకు సాగేలా చేస్తాయి. అలాగే మానవ సృష్టి ముందుకు సాగటానికి పరస్పర లింగ వైరుధ్యమున్న స్త్రీ పురుషుల కలయిక ద్వారానే మానవ సమాజం వృద్ధి చెందుతుంది. ఈ ఇద్దరి కలయిక ద్వారానే భువిలో మానవులు పుట్టుకు వస్తారు. అలా కాకుండా, కేవలం పురుషుడు మరో పురుష నితో లేక స్త్రీ మరొక స్త్రీతో లైంగికంగా కలిస్తే మానవ మనుగడ స్తంభించిపోతుంది.

**- డా. ముహమ్మద్ ముఅజ్జమ్ అలీ**

ఓట్లు కోరుతున్న కాంగ్రెసు, బీఆరెస్ పార్టీలు ముస్లిములకు మాత్రం టిక్కెట్లివ్వడం లేదు. బీఆరెస్ పార్టీ ముస్లిములకు చాలా చేశానని చెబుతోంది. కాని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేవలం ముగ్గురికి మాత్రమే టిక్కెట్లిచ్చింది. దాదాపు 40 స్థానాల్లో ముస్లిములు నిర్ణాయకస్థాయిలో ఉంటే కేవలం మూడు టిక్కెట్లు. ఇందులో ముహమ్మద్ షకీల్ ఆమిర్ బోధన్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే. మరొకరు చార్మినార్ నియోజకవర్గం నుంచి పోటీ పడుతున్న సలాహుద్దీన్ లోధీ. ఇక్కడ మజ్లిస్‌తో స్నేహపూర్వక పోటీ అని చెప్పుకోవాలి. అంటే బీఆరెస్ అభ్యర్థి గెలిచే అవకాశమే లేదు. అలాగే బహదూర్ పురాలో ఇనాయత్ అలీకి టిక్కెట్టిచ్చారు. ఇక్కడ కూడా మజ్లిస్‌తో స్నేహపూర్వకమైన పోటీయే. అంటే ఈయన కూడా గెలవడం కష్టం. అంటే నిజానికి కేవలం ఒకే ఒక్క టిక్కెట్టు బీఆరెస్ ఇచ్చిందని అర్థం చేసుకోవాలి. ఇక కాంగ్రెసులో చూస్తే మొత్తం ఆరుగురు ముస్లిం అభ్యర్థులకు టిక్కెట్లిచ్చింది. ఇందులో ముహమ్మద్ అజ్హరుద్దీన్ జుబిలీ హిల్స్ నుంచి పోటీ చేస్తున్నారు. మాజీ మంత్రి ముహమ్మద్ అలీ షబ్బీర్ నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీ చేస్తున్నారు. నాంపల్లి నుంచి ఫిరోజ్ ఖాన్, కార్వాన్ నుంచి ఉస్మాన్ అల్ హాజిరి, చార్మినార్ నుంచి ముజీబుల్లా షరీఫ్, మలక్ పేట నుంచి షేక్ అక్బర్ పోటీ పడుతున్నారు. బీఆరెస్ కన్నా ఈ విషయంలో కాంగ్రెసు కాస్త మెరుగ్గా కనిపిస్తున్నప్పటికీ ముస్లిములకు ఇవ్వవలసినంత రాజకీయ ప్రాతినిధ్యం ఇవ్వడం లేదన్నది స్పష్టం. మజ్లిస్ తొమ్మిది స్థానాల్లో పోటీ చేస్తుంటే అందులో ఒక టిక్కెట్లు ముస్లిమేతరులకు కేటాయించింది. మరో విషయం గమనించవలసిందేమిటంటే, చార్మినార్, మలక్ పేట, కార్వాన్, బహదూర్ పుర నియోజకవర్గాల్లో బీఆరెస్ ఎవరికి టిక్కెట్లు ఇచ్చినా, కాంగ్రెసు ఎవరికి టిక్కెట్టు ఇచ్చినా ఇక్కడ బలంగా ఉన్న మజ్లిస్‌తో పోటీ పడడం సులభం కాదు.

అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ముస్లిముల ప్రాతినిధ్యం పెరగవలసిన అవసరం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. కాని ప్రధాన పార్టీలు ముస్లిములకు మొండిచెయ్యి చూపించడం వల్ల అసెంబ్లీలోను, పార్లమెంటులోను ముస్లిములు కనిపించడం లేదు. తెలంగాణ అసెంబ్లీలో ముస్లిము ముఖాలుగా కేవలం మజ్లిస్ పార్టీ నేతలే ఎక్కువగా కనిపించడానికి కారణం ఇదే. బీఆరెస్ లో ముహమ్మద్ షకీల్, కాంగ్రెసులో ముహమ్మద్ అలీ షబ్బీర్ ఈ ఇద్దరు నేతలు తప్ప జిల్లాల నుంచి ముస్లిం నేతలు మరెవ్వరు కనిపించడం లేదు. టిక్కెట్లు లభించిన మిగిలిన వారంతా కేవలం హైదరాబాదుకు చెందిన వారే. ఈ ఎన్నికల్లో కాంగ్రెసు హవా నడుస్తుందా? లేక బీఆరెస్ హవా నడుస్తుందా? ముస్లిములు ఎవరి వైపు మొగ్గు చూపుతున్నారు? అనే ప్రశ్నల కన్నా ముస్లిముల రాజకీయ ప్రాతినిధ్యం పట్ల ఈ పార్టీలు నిర్లక్ష్యంగా వ్యవహరించడానికి కారణాలేమిటి అనే ప్రశ్న ముస్లిం సముదాయానికి అత్యంత కీలకమైన ప్రశ్న. ❑


## చందాదారులకు విజ్ఞప్తి

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

అధ్యాయం -3

7

# నిర్ధారణాగ్రేసరుడు మహనీయ అబూ బక్ర్ (రజి)

## ఎస్.ఎమ్. మలిక్

### ఖిలాఫత్, ప్రాతినిధ్య పాలన

ప్రవక్త మస్జిద్‌లో జరిగిన సర్వ సామాన్య ప్రమాణ స్వీకారం తరువాత మహనీయ అబూ బక్ర్ (ర) ముస్లిములను సంబోధించి పలికారు,

"జనులారా! నన్ను మీ పైన ఏలికగా నియమించడం జరిగింది, కాని వాస్తవానికి నేను మీకన్నా మెరుగయిన వాణ్ణి కాను. అయితే నేనేమయినా మంచి కార్యాలు చేసినట్లయితే నాకు తోడ్పాటు నివ్వండి, లేదా నేనేదయినా చెడు వైపునకు వెడుతున్నట్లు చూసినట్లయితే నన్ను చక్కదిద్దండి. గుర్తుంచు కోండి, సత్యం అప్పగింత లాంటిది, అసత్యం, సత్యంలో ద్రోహం వంటిది. (అంటే నేను ఈ స్థానంలో, దైవ ప్రవక్త స్థానంలో పాలకునిగా, పదవిని అప్పగింతగా స్వీకరించాను, అందువల్ల నేను స్వయంగానూ సత్య పథాన్ని అనుసరించ వలసి ఉంటుంది, ఇతరుల్నీ సత్యపథాన నడపవలసి ఉంటుంది. నేను అలా చేయలేకపోతే అది అసత్యం, ద్రోహం, నా బాధ్యతలకు విరుద్ధమయినది).

"జనులారా! మీలో బలహీనుడయిన వ్యక్తి నా దృష్టిలో బలమయినవాడు, నేనే కడకు అతని హక్కును అతనికి అప్పగించవలసి ఉంటుంది, ఇన్‌షా అల్లాహ్! మరి బాహ్యంలో బలోపేతుడయిన వ్యక్తి, నా దృష్టిలో బలహీనుడు, కడకు ఓ నిరాధార బలహీన వ్యక్తి హక్కును అతన్నుండి తిరిగి అతనికి అప్పగించనంత వరకు, ఇన్‌షా అల్లాహ్!"

"ఏ ముస్లిమ్ ప్రజ దైవమార్గంలో నిరంతర కృషి సలపడం మానుకుంటుందో దాన్ని దైవం అతి హీన స్థితికి, అతి నీచ స్థాయికి చేర్చి వేస్తాడు. మరే జాతిలో దుర్నీతి, దుర్వ్యవహారం, నీతి బాహ్యత సామాన్యమయిపోతాయో దాని ఇబ్బందుల్ని దైవం సర్వసామాన్యం చేసి వేస్తాడు. నేను దైవం, దైవ ప్రవక్త మార్గాన నడుచుకున్నంత వరకు నాకు విధేయులయి మెలగండి, కాని నేను దైవం దైవ ప్రవక్తల దారిని వదిలినప్పుడు, మీలో ఏ ఒక్కరి పైనా నా ఆదేశం చెల్లనేరదు. సరే సరే, ఇక నమాజ్ కొరకు నిలువండి, దైవం మిమ్మల్ని కరుణించుగాక! "

### ప్రజా పరిపాలన

ఇదీ సంక్షిప్తమయిన సమగ్రమయిన రూపం, ఖిలాఫత్ (ప్రాతినిధ్య పాలన) అన్నా, ఖలీఫా (ప్రాతినిధ్య పాలకుడు) అన్నా! అంతే కాదు, నిజానికి ఏ పరిపాలన అయినా మరే పరిపాలకుడయినా నిజానికి అనుసరించ వలసిన విధాన మయినా ఇదే. ఇదే ఓ నిజమయిన, పరిపక్వమయిన ప్రజా పరిపాలనా విధానాన్నీ సూచిస్తుంది. ఓ నిజమయిన పరిపాల కుడు సమాజం నుంచి చెడును దూరం చేసి మంచిని వర్ధిల్ల జేయకపోతే అది ప్రజాపరిపాలన ఎలా అవుతుంది? ప్రజల యోగక్షేమాలు, వృద్ధివికాసాలు, సురక్షణా వ్యవహారాలు

సవ్యంగా గమనించకపోతే అది సంక్షేమ రాజ్యం ఎలా అవుతుంది? అందువల్లనే ఖిలాఫత్ విధానం నిజమయిన పరిపాలనా విధానం.

స్వయంగా తాను పాలిత ప్రజల సకల విధాల మేళ్ళ కొరకు జాగరూకుడయి ఉంటూ పరిపాలనా యంత్రాంగాన్ని అహర్నిశలు జాగ్రదావస్థలో ఉంచగలిగిన పాలనాధిపతియే నిజమయిన ప్రజా పాలకుడు. ఈ సత్యాన్నే వెల్లడి చేస్తుంది, తొలి ఖలీఫా మహనీయ అబూ బక్ర్, ఖిలాఫత్ భారం స్వీకరించిన తరువాత చేసిన ఈ ఉపన్యాసం. మరోసారి ఇలా కూడా అన్నారు,

**"పెద్ద భారం నా పైన మోపడం జరిగింది, దీన్ని నేను ఎలా మోయగలనో!?"**

ఇంకో సందర్భంలో,

**"జనులారా! ఈ భారాన్ని మరెవరయినా నిర్వహిస్తే బావుండేదని నేను తలపోశాను, మీరు నా ద్వారా ప్రవక్త మహనీయుల సరయిన, ఖచ్చితమయిన అనుసరణను కాంక్షిస్తే, నేనేమో బలహీనుణ్ణి, నావల్ల ఆయన అనుసరణ సాధ్యమా అని యోచిస్తుంటాను"** అని అన్నారు.

## సమస్యల మోహరింపు

ప్రవక్త శ్రీ (స) పరమపదించిన తరువాత మహనీయ అబూ బక్ర్(ర) ఇస్లామీయ రాజ్య పరిపాలనలో విభిన్న సమస్యలు తలలెత్తాయి. అనేక చిక్కులు ఒక్క సారిగా ముందుకు రావడం చేత ఖలీఫా(ర) వడివడిగా అనేక చర్యలు గైకొనవలసి వచ్చింది. ఆ సమస్యలు:

రోమను చక్రవర్తి (కైసర్) ఇస్లామీయ రాజ్యాన్ని తన సామంత రాజ్యంగా మార్చాలని ప్రవక్త శ్రీ(స) రోజుల్లోనే ప్రయత్నాలు మొదలెట్టాడు. ఆ కారణంగా ఇస్లామీయ సేనను రోమను సరిహద్దులకు పంపాలని, సేనను కూడా నిర్ధారించారు ప్రవక్త శ్రీ.

యమన్, నజ్ద్ రాష్ట్రాలలో ఇంకా అరేబియాలో దాదాపు సమస్త జనాభా దైవ ధర్మ సద్వచనం పఠించి ఇస్లామ్ శరణు పొందింది. అయితే ఈ మహత్తర జనం సుశిక్షణ జరగవలసి ఉంది. ప్రవక్త పరమపదించిన తరువాత వీరంతా జకాత్ నివ్వలేమని దాటవేయ సాగారు. వారినీ విచారించ వలసి ఉంది.

అనేక మంది నాయకులు మహనీయ దైవ సందేశహరుల (స) యదార్థాన్ని గ్రహించలేక తాము కూడా ఇలా ఏదయినా ట్రిక్కు చేసి పెద్ద మనుషులమయి పాలకుల మెందుకు కాజాలమని భావించి, కొంత జనానికి ఏవో ఆశలు జూపి ఒక సమూహాన్ని తమ వద్ద సమకూర్చుకున్నారు. ఇక తాము కూడా ప్రవక్తలమని అబద్ధ ప్రవక్తా ప్రకటన చేశారు!

మహనీయ అబూ బక్ర్ (ర) ఈ సమస్యలన్నింటినీ ఎంతో ధైర్యంగా, శౌర్యంతో ఎదుర్కొన్నారు. ఈ అగ్ర రాజ్యాల దురాక్రమణ బెదిరింపులను, తిరుగుబాటును, దొంగ ప్రవక్తల వాదనను ఆయన ఎంతో చాకచక్యంగా అణచి వేశారు. ఇలా తన సామర్థ్యాన్ని అతి తక్కువ వ్యవధిలోనే రుజువు చేసుకో గలిగారు. ఇక ఒక్కొక్క సమస్యను పరిష్కరించిన తీరును గమనిద్దాము.

## 2. ఉసామా సేన

ప్రవక్త శ్రీ(స) తన సందేశాన్ని చేరవేయడానికి రాజులకు, పాలకులకూ లేఖలు పంపినట్లే, రోమనుల అధీనంలోని అరబ్బు గవర్నరు, గస్సానీ వద్దకు హిజ్రీ 8వ సంవత్సరం మహనీయ హారిస్ ద్వారా లేఖ పంపారు. అతను మహనీయ హారిస్‌ని చంపించాడు. ఆ తరువాత హెచ్చరిక కలగాలని, మూడు వేల మంది సేనతో మహనీయ జైద్‌ని కూడా పంపారు. గస్సానీ రోమనుల సహకారంతో ఒక లక్ష సిపాయిలతో ఎదుర్కొన్నాడు. మూతా అనే చోట ఉభయ సేనలు మార్కొన్నాయి. మహనీయ జైద్ అమరగతి పొందారు, కాని అతను ముస్లిమ్ సేనను ఓడించ లేకపోయాడు.

హిజ్రీ 11వ సంవత్సరం ప్రవక్త శ్రీ (స) సేనను, మహనీయ జైద్ కుమారుడు, యువకుడయిన ఉసామా (ర) నాయకత్వాన రోమనులను జయించడానికి పంపారు. ఈ సేన బయలుదేరిన వెంటనే ప్రవక్త శ్రీ అనారోగ్య సమాచారం మహనీయ ఉసామాకు తెలిసింది. ఆయన ప్రయాణం ఆపివేశారు. ఆ పైన పరమపదించిన వార్త అందగానే సేనతో పాటు వెనుదిరిగారు.

## అబూ బక్ర్(ర) పట్టు పట్టిన విషయం

మహనీయ అబూ బక్ర్ ఖలీఫాగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ప్రప్రథమంగా ఉసామా సేనను ప్రవక్త శ్రీ ఆదేశానుసారం రోము సామ్రాజ్య సరిహద్దులకు పంపాలని కోరుకున్నప్పుడు పలువురు సహచర మాన్యులు వ్యతిరేకించారు. వారి వాదన ఏమిటంటే, 'ఈ రోజుల్లో దేశమంతటా అతి సున్నితమయిన పరిస్థితులు నెలకొన్నాయి. పలుచోట్ల నుండి ఘోరమయిన సమాచారం అందుతోంది, ఏ ఘడియనయినా మదీనా పైన శత్రు దాడి జరగవచ్చు.'

దీనికి ప్రతిగా సిద్దీక్ మహనీయుల (నిర్ధారణాగ్రేసరులు) వాదన ఏమిటంటే, 'ఏ కార్యాన్నయితే ప్రవక్త శ్రీ ప్రారంభించారో దాన్ని ఆపే అధికారం తనకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాప్తం కాదు' అన్నది.

### ఇతర సహచరుల అభ్యంతరాలకు ఆయన సమాధానం

"నా ప్రాణం ఏ ప్రభువు హస్తగతమయి ఉందో ఆయన మీద ఒట్టు, నన్ను క్రూర మృగాలు చీల్చి చెండాడతాయి, కుక్కలు నక్కలు నన్ను ఈడ్చుకు పోతాయి అన్న విషయం తెలిసినా నేను ఈ సేనను ఆపను. ఈ నగరాలన్నింటిలో, దేశమంతటిలో ఏ ఒక్క వ్యక్తీ లేకపోయినా, కేవలం నేనొక్కణ్ణే మిగిలిపోయినా అప్పటికీ ఈ సేన తప్పక బయలుదేరుతుంది."

వాస్తవమేమంటే ఆ సందర్భంలో మహనీయ అబూ బక్ర్(ర) జనుల మాట విని సేనను ఆపి ఉన్నట్లయితే దైవ సందేశహరుల వ్యతిరేకతకు తొలి విత్తనం ముస్లిమ్ సముదాయంలో ఆనాడే నాటబడేది! అది, దైవం మన్నించు గాక, నేడు మహా వృక్షమయి మనల్ని పీడించేది! ఎందుకంటే ఆ సేనను ప్రవక్త మహనీయులు స్వయంగా పంపమని ఆదేశించడమే కాక, పరమపదించక ముందు అనేక పర్యాయాలు తాకీదు కూడా చేశారు.

యదార్థానికి ఆ సేనకు కమాండరు, మహనీయ జైద్ కుమారుడు ఉసామా. ఆయన ప్రవక్త శ్రీ నౌకరు. నవయువకుడు. అప్పుడు ఆయన వయసు పదిహేడు ఏళ్లు. అన్సారులకు ఆయన నాయకత్వం నచ్చలేదు. కాని స్వయంగా వెళ్లి చెప్పే సాహసం చేయలేకపోయారు, మహనీయ ఉమర్(ర)ని పంపారు.

### ఆయన వెళ్లి అబూ బక్ర్(ర)తో ఇలా చెప్పారు

"మీరు సేనను పంపాలనే అనుకుంటే ఏదయినా గౌరవప్రదమయిన కుటుంబం వారినీ, వయసు గల వారినీ నాయకునిగా నియమించి పంపవలసింది. అతను తన ప్రవృత్తి రీత్యానూ సంకల్ప బలం రీత్యానూ శక్తిశాలి, సమర యుక్తులూ నేర్పు పరంగానూ యోగ్యుడయిన వాడునూ అయి ఉంటే బాగుం డేది" అని అన్నారు.

ఆయన ఇచ్చిన ఈ సలహా విని మహనీయ అబూ బక్ర్ కోపానికి తట్టుకోలేక ఇలా అన్నారు,

"ఖత్తాబ్ తనయుడా! నీ తల్లి నీ కోసం రోదించు గాక, నిన్ను కోల్పోవుగాక! నా నాయకులు దైవ సందేశహరులు (స) ఆ అబ్బాయి, ఉసామాని నియమించారు, నువ్వు అతణ్ణి తొలగించమని సలహానిస్తావా?"

మహనీయ అబూ బక్ర్ కు, తన సలహా మండలిలో , సేనలో, కురైష్, అన్సార్ నాయకుల్లో ఉసామా నాయకత్వం వల్ల ఉత్పన్న మయిన ఈ భావోద్రేకాలను గురించి బాగా తెలుసు. వారి ఆలోచనల్ని చక్కదిద్దేందుకు ఎంతో చాకచక్యంగా ఈ సందర్భాన్ని ఎన్నుకుని, ఓ మార్గం కనుగొన్నారు. అటువంటి భావనల్ని, దృక్కోణాన్ని సరయిన దిశలో మలచడానికి వాటిని మొదల్లోనే మార్చి వేయాలని అనుకున్నారు. ఆ విధంగా ఎవరినయితే వారు ఉన్నత వర్గీయుల కన్నా అధముడని భావిస్తున్నారో అతను కూడా వారి కన్నా ఉన్నతునిగానే అగుపించాలన్నది ఆయన ఉద్దేశం!


### అజ్ఞాన కాలం ప్రభావాలు

కాగా ఆయన మహనీయ ఉసామా, ఆయన తోపాటు యాభై వేల సిపాయీల సేనకు వీడ్కోలు చెప్పడానికి వెళ్లినప్పుడు, ఆ సేనలో ఘనత వహించిన సహచర మాన్యులు, తెగ నాయకులు, మహా యోధులు, నవ యువకులు ఉసామా నేతృత్వంలో సమర రంగంలోకి వెడుతున్నారు. దాని మహత్తు ఏమిటంటే, ఉసామా గుర్రం పగ్గాలు, మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ పట్టుకుని నడుస్తున్నారు, మరి స్వయంగా ఖలీఫా అబూ బక్ర్, ఆయన గుర్రంతోపాటు కాలినడకన వస్తున్నారు.

మహనీయ ఉసామా తన గుర్రాన్ని ఆపివేశారు. సేనాని ఆగిపోగానే సేన మొత్తం ఆగి పోయింది. ఉసామా క్రింది చూపుతో విన్నవించు కున్నారు, "ఓ ప్రవక్త ఖలీఫా! మీరు కూడా గుర్రమెక్కండి లేదా నన్నయినా దిగి నడిచే అనుమతి నివ్వండి" అని వేడుకున్నారు.

ఆయన ఉసామా పైన ఓ దృష్టి సారించి, "నేనూ గుర్రమెక్కను, నిన్ను కూడా కాలినడకన నడవ నివ్వను" అని బదులిచ్చారు.

మహనీయ అబూ బక్ర్ వేలాది సిపాయీల ఎదుట ఈ ప్రదర్శన నిర్వహించారు, కులీనుడు కాని ఓ నవ యువకుని గౌరవార్థం తానే కాక వేలాదిమంది చేత మాన్యత నిప్పించారు. తద్వారా మిగిలి పోయిన అజ్ఞాన కాలపు మూఢ భావాలు సమసి పోవాలన్నది ఉద్దేశం. అరబ్బులు యువకుల్ని, బానిసల్ని, వారి సంతానాన్ని అనుభవం లేనివారని, వారిలో ఎన్నెన్ని సుగుణాలున్నా పెద్దల సమక్షంలో వారికి ఎటువంటి స్థానం ఇవ్వరు. అరబ్బుల ఈ దుర్వర్తనల కెదురుగా అబూ బక్ర్ మహనీయులు నిర్వర్తించిన పోరిది! ❑




యండి. ఉస్మాన్ ఖాన్

# భవితను నిర్ణయించే వజ్రాయుధం: ఓటుహక్కు

**ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం.** ఓటును మించిన ఆయుధం మరొకటిలేదు. కాని ఈనాడు ఓటును అమ్మే, కొనే సరుకుగా మార్చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి తీరనినష్టం.

రాజకీయ నాయకులు ప్రజల్ని ఓట్లు అమ్ముకునే వారుగా చూస్తున్నారు. నేటి రాజకీయ నాయకులకు ప్రజలపై ఏమాత్రం గౌరవం లేకుండా పోయింది. ఈధోరణి సమసిపోవాలి. ప్రజలు తమకు సేవచేయడంకోసం ఐదేళ్ళ కాలపరిమితికి సేవకుల్ని ఎన్నుకునే శక్తి ఓటు. సమాజానికి ఒకసార్వత్రిక విలువను తెచ్చిపెట్టిన ఓటును రాజకీయనేతలు కొనుగోలు వస్తువుగా మార్చివేయడం సిగ్గుచేటు. రాజ్యాంగం ప్రసాదించిన భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి మూలకందం. ఇంతటి విలువైన ఓటును ప్రజలు ఏవిధమైన ప్రలోభాలకూ తాకట్టు పెట్టకూడదు. ఓటు అనే ఆయుధంతో మంచి పాలకులను ఎన్నుకోవడం ద్వారా సమాజం బాగుపడుతుంది. ఓటు విలువను ప్రతి ఒక్కరూ గుర్తించి ఓటు హక్కును వినియోగించుకోవాలి. నిరక్షరాస్యులేకాదు, ఉన్నత విద్యావంతులు సైతం ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవడం లేదు. మన భవితను నిర్ణయించే ఓటుహక్కుపట్ల నిర్లిప్తత ఎంతమాత్రం మంచిదికాదు. ముఖ్యంగా యువత నిర్లిప్తత వీడి బాధ్యతను గుర్తించాలి. యువతరంతోనే మార్పు సాధ్యమవుతుంది. ప్రజాస్వామ్యం బలోపేతం కావాలంటే మనం తీసుకునే మంచి నిర్ణయం పైనే ఆధారపడి ఉంది. ఒకవేళ మనం ప్రలోభాలకు లొంగితే ప్రశ్నించే హక్కును కోల్పోతాం. కనుక ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా

ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను గుర్తించి నిజాయతీగా ఓటు వేయాలి.

## అభ్యర్థి ఎలాంటివాడైఉండాలి?

అభ్యర్థి అవినీతికి, అక్రమాలకు పాల్పడని వాడైఉండి, ప్రజాస్వామ్యం పట్ల, సెక్యులర్ విలువల పట్ల అపార నమ్మకం కలిగిన వాడై ఉండాలి. ఉన్నంతలోనే మంచివారిని ఎన్నుకునే ప్రయత్నం చెయ్యాలి. సమాజం పట్ల, దేశ భవిష్యత్తుపట్ల ప్రేమ కలవాడై, ప్రజల సమస్యలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి. వాటిని పరిష్కరించాలన్న తపన కలిగినవాడై ఉండాలి. మతోన్మాదంతో పోరాటంతోపాటు, ప్రజా సమస్యలపై తక్షణం స్పందించే గుణం కలవాడై ఉండాలి. సమస్యల పరిష్కారానికి, ప్రజా సంక్షేమానికి ప్రజలు తమ తరఫున తనను ఎన్నుకున్నారు కాబట్టి తాను ప్రజలకు సేవకుడినన్న భావన కలవాడై ఉండాలి. అందరినీ సమ దృష్టితో చూసేవాడైఉండి, మతోన్మాదానికి దూరంగా ఉండాలి. ప్రజాస్వామ్య, సెక్యులర్ విలువల్ని గౌరవించేవాడు, విషయ పరిజ్ఞానంతో చట్టసభల్లో ప్రజావాణిని వినిపించగల సామర్థ్యం ఉన్నవారిని ఎన్నుకోవాలి. సామాన్యులు ఏదైనా పనిమీద వెళ్ళినప్పుడు స్పందించే తీరునుబట్టి కూడా ఓటేయవచ్చు.

## ఈ ఎన్నికలు కీలకం

మతోన్మాద శక్తులు తెలంగాణ గడ్డపై కన్నేసి అధికారాన్ని హస్త గతం చేసుకోడానికి ప్రయత్నం చేస్తున్నాయి. బూటకపు వాగ్దానా లతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నాయి. ప్రజలమధ్య విభే ధాలు సృష్టించి, మత విశ్వాసాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకో వాలని పథకాలు రచిస్తున్నాయి. కులాల మధ్య, మతాలమధ్య చిచ్చుపెట్టి తెలంగాణ అలయ్ బలయ్ సంస్కృతిని కలుషితం చెయ్యడానికి ప్రయత్నిస్తున్నాయి. తెలంగాణ సంస్కృతిని, ఇక్కడి సామరస్య వాతావరణాన్ని కలుషితం చెయ్యాలని చూస్తున్నాయి. ప్రజలమధ్య చిచ్చు పెట్టేవారిని, మనోభావాలతో ఆడుకొనేవారిని, డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలకు లోను చేసి ఓట్లుకొల్లగొట్టా లని చూసే వారిని చిత్తుచిత్తుగా ఓడించాలి. ఎందుకంటే, ఈ ఎన్నికలు చాలా కీలకమైనవి. బరిలో నిలచిన అన్ని పార్టీలు ఏదో ఒక విధంగా ఓటర్లను ప్రలోభపెట్టి అధికార పీఠాన్ని అధి రోహించాలని ఉవ్విళ్ళూరుతున్నాయి. ఇన్నాళ్ళూ అధికారానికి దూరంగా ఉన్నవారూ, పదేళ్ళుగా అధికారం వెలగబెడుతున్న వారూ, కుల మతాలమధ్య చిచ్చుపెట్టి అందలం అందుకోవాలను కుంటున్న వారూ తెలంగాణలో అధికారంకోసం పోటీ పడు తున్నారు. మొన్నటి వరకూ అధికార పార్టీకి ప్రధాన ప్రత్యర్థి



తానేనని విర్రవీగిన వారు, ప్రస్తుతం మూడోస్థానం కోసం పాకు లాడుతూ హంగ్ రావాలని కోరుకుంటున్నారు. హంగ్ గనక వస్తే తాను సాధించబోయే ఐదో, పదో సీట్లతో కింగ్ మేకర్ కావాలని కలలు కంటున్నారు. అదే విధంగా మొన్నటి వరకూ వందసీట్లు మావేనని కోతలు కోసినవారు కూడా ఒకవేళ నిజం గానే హంగ్ వస్తే, మతోన్మాద పార్టీల సహకారం తీసుకోడానికి కూడా ఏమాత్రం వెనుకాడని పరిస్థితి. మొదట్నుంచీ వారిమధ్య లోపాయికారీ అవగాహన ఉందనేది బహిరంగంగా జరుగుతున్న చర్చ. ఇందులో నిజమేంతో ఇదమిద్ధంగా తెలియకపోయినా, జరుగుతున్న పరిణామాలు ఇస్తున్న సంకేతాలవే. కనుక తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ సంక్షేమాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరిదీ. తెలంగాణలో గనక ఈమతోన్మాద శక్తులకు ఏమాత్రం అవకాశం లభించినా లౌకిక విలువలు, ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్వీర్యమై ఉన్మాద భావజాలం రాజ్యమేలు తుంది. అందుకని ఎట్టి పరిస్థితిలోనూ 'పరివార్' భావజాలాన్ని నిలువరించాల్సిందే. సెక్యులర్ భావజాలం కలిగిన అభ్యర్థులను మాత్రమే చట్టసభలకు పంపాలి. 'అందరూఅందరే' అన్నట్లుగా అభ్యర్థులున్నప్పుడు, ఉన్నంతలోనే మెరుగైన వ్యక్తిని ఎంపిక చేసుకోవాలి. నేరచరిత్ర కలిగిన వారు, మతోన్మాద ఫాసిస్టు భావాలు కలిగిన వారు ప్రజాప్రతినిధులుగా, చట్టసభల సభ్యు లుగా అనర్హులు. ఒకవేళ అభ్యర్థి నచ్చని పక్షంలో కూడా ఓటు వేయకుండా ఉండడం సరికాదు. ఉన్నవాళ్ళలోనే కాస్త మెరుగైన వారికి, సెక్యులర్ అనుకున్న వారికి ఓటు వేయాలి. మరీ గత్యంతరం లేనప్పుడు చివరి అస్త్రంగా మాత్రమే 'నోటా'కు ఓటువేసి, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి. తద్వారా బరిలో ఉన్న అభ్యర్థులెవరూ అర్హులు కాదన్న సంకేతాన్ని ఇవ్వ వచ్చు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే వజ్రాయుధం. ✤




- నసీరా బేగం

# ప్రణాళిక తప్పనిసరి

**మనం** ఎన్నోసార్లు కొంతమందిని చూసి ఆశ్చర్యానికి గురవుతూ ఉంటాము. ప్రపంచంలోని కొంతమంది ప్రజలు తక్కువ సమయంలో ఎన్నో ఘనకార్యాలు చేసి ఉంటారు. వారు ఏ రంగానికి చెందిన వారైనా కావచ్చు. విద్యార్థులు కావచ్చు, ఉపాధ్యాయులూ కావచ్చు. యజమానులు కావచ్చు, కూలివారు కావచ్చు, రాజకీయ నాయకులూ కావచ్చు. లేదా వ్యాపారులూ కావచ్చు. సామాజిక కార్యకర్తలూ కావచ్చు లేదా కంపెనీల స్థాపకులు కావచ్చు. వీరు తమ జీవితంలోని ప్రారంభ కాలంలోనే లేదా పని ప్రారంభించిన అతి కొద్ది సమయంలోనే తన లక్ష్యం కంటే కూడా ఎన్నో రెట్లు అధికంగా ముందుకు దూసుకుపోతారు. ఇలాంటి వారికి వాస్తవంగా పుట్టుకతోనే కొన్ని ప్రత్యేక నైపుణ్యాలను కలిగి ఉంటారు. ఇవి వారి ప్రభువు తరపు నుంచి వారికి లభించి ఉంటాయి. కాని వారికి నైపుణ్యాలు లభించి ఉండటం మాత్రమే వారి లక్ష్యసాధనలో ముందుకు దూసుకుపోవటానికి వారికి సరిపోవు. దానితోపాటు సమయాన్ని సరైన రీతిలో వినియోగించుకోవటం, ప్రణాళికను సిద్ధం చేసుకుని దాని ప్రకారం పూర్తిగా పని చెయ్యటం తప్పనిసరి అవుతుంది. దానికారణంగానే అది వారికి సాధ్యమవుతుంది.

వారికి కూడా అందరితోపాటు ప్రతి దినానికి ఇరవై నాలుగు గంటలు మాత్రమే లభిస్తాయి. ఒకవేళ మనం కూడా ఆ ఇరవై నాలుగు గంటలను ప్రణాళికాబద్ధంగా వినియోగించినట్లయితే మనం కూడా ఏదో ఒక పెద్ద కార్యాన్ని తక్కువ సమయంలోనే చెయ్యగలుగుతాం. మనం ఏ కార్యానికైతే సమయాన్ని నిర్ణయిస్తామో ఆ సమయం ప్రకారమే గనక మనం ఆ కార్యాన్ని నెరవేర్చినట్లయితే అప్పుడే దాన్ని మనం సరైన రీతిలో పూర్తి చేశామన్న మాట. అప్పుడే మనం సాఫల్యాన్ని పొందుతామన్నది సత్య విషయం. ప్రణాళికను సిద్ధం చేసుకున్న తరువాత దానిని పూర్తిగా పాటించకపోవటం కారణంగా మనిషి అసాఫల్యానికి గురవుతాడు.

ఒక విద్యార్థికి అతను తన చదువును సరైన రీతిలో పూర్తి చెయ్యటానికి ఒక ప్రణాళిక అనేది తప్పనిసరి అవుతుంది. ఒకవేళ అతను ఒక ప్రణాళిక తయారు చేసుకోకపోయినట్లయితే అతను సమయాన్ని సరైన రీతిలో వినియోగించుకోలేడు. అదేవిధంగా ఒక ఉద్యోగి కూడా తన వ్యక్తిగత కార్యాలను, తన కార్యాలయ కార్యాలను రెండింటినీ ఒక ప్రణాళికాబద్ధంగా చెయ్యకపోయినట్లయితే అతను రెండు రంగాలలోను విఫలుడవుతాడు. అదేవిధంగా ఒక వ్యాపారి అయినా, ఒక ఉపాధ్యాయుడైనా, ఒక రాజకీయ నాయకుడైనా, ఒక సంస్థకు యజమాని అయినా, ఒక మామూలు కూలీ వాడైనా, ఒక ఇల్లాలు అయినా అందరికీ ప్రణాళిక అనేది తప్పకుండా కావలసిందే.

ప్రణాళిక అనేది చిన్నదైనా సరే, పెద్దదైనా సరే దాని విలువ ఎంత మాత్రమూ తగ్గదు. ప్రణాళిక ద్వారా మంచి ఫలితాలు పొందదలిస్తే ప్రణాళికను తన జీవితానికి సంబంధించిన ప్రతి పని కోసం అలవాటు చేసుకోవాలి. అప్పుడు దాని ఫలితాలు చూసిన ప్రతి ఒక్కరూ ప్రణాళికాబద్ధంగా జీవితం గడపటానికి సిద్ధమవుతారు.

ప్రణాళిక అంటే టైమ్‌టేబుల్. మనం చెయ్యవలసిన కార్యాల ఒక పట్టిక ఉంటుంది. దానికి ఒక నిర్ణీత కాలం వరకు పూర్తి చెయ్యటానికి ఒక కార్యక్రమం తయారు చెయ్యబడుతుంది. ఈ ప్రణాళిక అనేది ప్రతి మనిషికి సంబంధించి వేర్వేరుగా ఉంటుంది. అది కొన్ని సంవత్సరాలకు సంబంధించింది అయి ఉంటుంది. లేదా కొన్ని నెలలకు లేదా కొన్ని రోజులకు లేదా ఒక దినానికి సంబంధించినది కూడా ఉండవచ్చు.

ప్రణాళికకు సంబంధించిన కొన్ని ప్రత్యేక విషయాలను విద్యా వేత్తలు, ప్రముఖులు వేర్వేరు విధాలుగా వర్ణించారు. మనిషి గనక ఒకవేళ ప్రణాళికాబద్ధంగా పని చేసినట్లయితే అతను ఊహించిన దానికంటే అధిక లాభాలను పొందగలుగుతాడు. మనిషి ప్రణాళికాబద్ధంగా వినియోగించిన ఒక్క నిమిషం ఇంకా చెయ్యబోయే కార్యాల పది నిమిషాలను మిగిల్చుతుంది. అంటే దాని అర్థం, మీరు గనక ప్రణాళికాబద్ధంగా పని చేసినట్లయితే అది మీకు తక్కువ సమయంలో ఎక్కువ పని చేసే సమర్థులుగా తీర్చిదిద్దుతుంది.

పనులకు సంబంధించిన ప్రణాళిక అసలు ఎందుకు తయారు చేసుకోవాలి అనే ప్రశ్నకు జవాబుగా ఎన్నో లాభాలను చూపించ వచ్చు.

మనిషి బలహీనత ఏమిటంటే, అతను ఏదైనా కార్యాన్ని చెయ్యదలచుకున్నప్పుడు అతని మనసులో ఎన్నో ఆలోచనలు రేకెత్తుతాయి. అవి మనకు అసలు లక్ష్యం నుంచి ఆపుతూ ఉంటాయి. ప్రత్యేకంగా ఒక మంచి కార్యాన్ని చెయ్యదలచుకున్నప్పుడు దాన్ని ఆపటానికి షైతాన్ తన పూర్తి శక్తిని వినియోగించి ఆటంకపరుస్తాడు. అతడు కేవలం ఆలోచనలను రేకెత్తించగలడు. కాని చెయ్యి పట్టుకుని ఆపలేడు. అల్లాహ్ మనిషికి ప్రణాళికను ఎందుకు నేర్పాడంటే అతను దానిద్వారా షైతాన్‌ను ఓడించటానికి. మనిషి తన కార్యాల ప్రణాళికను తయారు చేసుకున్నట్లయితే అతను ఒక పని తరువాత మరొక పనిని చకచకా పూర్తి చేసుకుంటూ పోతాడు. అతనికి మధ్య మధ్యలో విరామ సమయం చాలా తక్కువగా ఉంటుంది. అతను ఈ విధంగా పనులలో నిమగ్నమై ఉన్న కారణంగా షైతాన్ ప్రలోభాలకు తక్కువగా గురికావటం జరుగుతుంది.

ప్రణాళిక అనేది మనిషిని తన కార్యాలలో వివేకాన్ని నేర్పుతుంది. ఆలోచించి, అర్థం చేసుకునే అవకాశాన్ని ఇస్తుంది. ఆచరణ మైదానంలో దూకే ముందు ముందుకు పోవటం మంచిదా? వెనుకకు మళ్ళించటం మంచిదా అని. దానికోసం కావలసిన శక్తియుక్తులు తన వద్ద ఉన్నాయా లేదా అని, తన శక్తియుక్తులకు సరైన విధంగా వినియోగిస్తున్నామా లేదా అనేది ఆలోచించేలా చేస్తుంది.

ప్రణాళిక ద్వారా మనిషి సంకల్పం కోసం తక్కువ శక్తిని వినియోగించి ఎక్కువ కార్యాలను నెరవేర్చగలుగుతాడు. మనిషి సంకల్పం అనేది ఒక ముఖ్యమైన నిధి. అది చాలా తక్కువగా కూడా ఉంటుంది. కనుక దానిని ఆలోచించి మరీ వినియోగించాలి. ప్రణాళికాబద్ధంగా కార్యాలను సిద్ధపరచుకున్నట్లయితే తన ద్వారా ఒక పని తరువాత మరొక పని దానంతట అదే అయిపోతూ ఉంటాయి. అంటే అవన్నీ అతని మనసులో ఆ విధంగా ప్రణాళిక ద్వారా పొందుపరచబడి ఉంటాయన్నమాట.

ప్రణాళిక తయారు చేసుకునేటప్పుడు మనిషి హృదయంలో ఒక ఉద్యమం రూపుదిద్దుకుంటుంది. అతను గనక ఆ పనులను పూర్తి చేసుకుంటూ పోయినట్లయితే అతనికి ప్రశాంతత కలుగుతుంది. దాని తరువాత మళ్ళీ రెండవ పని, మూడవ పని ఒకదాని తరువాత ఒకటి దానికంతటి అవే అయిపోయినట్లుగా అనిపిస్తాయి.

ప్రణాళిక కారణంగా మనిషి హృదయంలో నమ్మకం అనే శక్తి అధికమవుతుంది. మనిషి తనను తాను నమ్ముతాడు. తమ కార్యాలను తాము ఒక ప్రణాళిక ప్రకారం చేసుకుంటూ పోయినట్లయితే తన మీద తనకు నమ్మకం అధికమవుతూ ఉంటుంది. ఆ నమ్మకంతో మనిషి జీవితం చిన్నచిన్న కార్యాలతో మొదలైనప్పటికీ పెద్ద పెద్ద కార్యాలను సైతం అతను సునాయాసంగా తేలికగా చెయ్యగలుగుతాడు.

ప్రణాళిక కారణంగా మనిషి శక్తి సామర్థ్యాలు పెంపొందుతాయి. మనిషి తన కార్యాలను గురించి ప్రణాళిక తయారు చేసుకునేటప్పుడు ఏ కార్యాలు ముఖ్యమైనవి, ఏవి తరువాత చేసుకోగలుగుతారో మరీ చూసి ప్రణాళిక పట్టికను తయారు చేసుకుంటాడు. దాని కారణంగా అతను ఒక దాని తరువాత ఒకటి చేసుకుంటూ పోతున్నప్పుడు ప్రతి పనిపై అతను ప్రత్యేక దృష్టిని పెట్టగలుగుతాడు. పూర్తి ఏకాగ్రతతో ఆ పనిని చెయ్యగలుగుతాడు. దాని ద్వారా అతని ప్రతి పని పూర్తి ఫలితాన్ని ఇస్తుంది. ఈ ఫలితం అతని ఒత్తిడిని తగ్గిస్తుంది.

ప్రణాళిక ద్వారా ఉత్తమ ఫలితాలు లభిస్తాయని తెలిసినప్పుడు మనిషి తప్పకుండా ప్రణాళికను తయారు చేసుకోవాలి. దానిపై పూర్తిగా పాటించే ప్రయత్నం చెయ్యాలి. ప్రణాళిక అనేది ఎక్కువ రోజులకు సంబంధించినది కూడా ఉండాలి. తక్కువ రోజులది ఉండాలి. చివరకు ఒక రోజు ప్రణాళిక కూడా ఉండాలి. ఉదాహరణకు ఒక నెలకు, తరువాత ఒక వారానికి ఆ తరువాత ఒక రోజుకు సంబంధించినది అయి ఉండాలి. ఈ ప్రణాళిక అనేది ఒక డైరీలో వ్రాసుకోవాలి. దానిద్వారా వాటిపై అమలు పరచటం తేలికైపోతుంది.

# రక్షణ లేని గాజాను నాశనం చేస్తున్న ఇజ్రాయెల్



**ఇజ్రాయెల్** దళాలు గాజా నగరం వైపు చొచ్చుకుపోతున్నాయి. ఈ దాడుల్లో పాలస్తీనీయుల మరణాల సంఖ్య గణనీయంగా పెరిగింది. పాలస్తీనా మరణాల సంఖ్య తాజా అంచనాల ప్రకారం 12,000 దాటింది. U.S. సెక్రటరీ ఆఫ్ స్టేట్ ఆంటోనీ బ్లింకెన్ మానవీయ కాల్పుల విరమణకు ఇచ్చిన పిలుపును ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు తిరస్కరించారు. హమాస్ బంధీలను విడుదల చేయకపోతే సైనిక కార్యకలాపాలలో విరామం ఇచ్చేది లేదన్నాడు. ఇజ్రాయెల్ గాజాపై ముఖ్యంగా గాజా నగరం చుట్టూ వైమానిక దాడులను కొనసాగించింది. నవంబర్ 3, 2023న తేదీన గాజా నగరంపై కొనసాగుతున్న వైమానిక బాంబు దాడుల కారణంగా ఇజ్రాయెల్‌లో పనిచేస్తున్న సుమారు 3,000 మంది పాలస్తీనియన్ల జీవనోపాధి దెబ్బతిన్నది. నవంబర్ 4న గాజా నగరానికి సమీపంలోని జబాలియా శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు వరుసగా రెండో రోజు కూడా జరిగాయి. ఈ శిబిరం గాజాలో అతి పెద్ద శరణార్థుల శిబిరం. అంతకుముందు రోజు, మంగళవారం నాడు జరిగిన వైమానిక దాడిలో కనీసం 50 మంది పాలస్తీనియన్లు మరణించారు, 150 మందికి పైగా గాయపడ్డారు. గాజాలో తీవ్రమైన మనావీయ సంక్షోభం నెలకొంది. ఈ శిబిరంలోని ఉగ్రవాద కమాండర్లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేశామని పేర్కొంది. పాలస్తీనా సాధారణ ప్రజలు మరణించారని హమాస్ పేర్కొంది. దాడి తర్వాత సహాయ సిబ్బంది శిథిలాల నుంచి బాధితులను, మృతదేహాలను వెలికి తీస్తున్న భయంకర దృశ్యాలు ప్రపంచం చూసింది. జబాలియా శరణార్థి శిబిరంపై భారీ వైమానిక దాడులు ఇజ్రాయెల్ హమాస్ యుద్ధలంలో తలెత్తిన తీవ్రమైన మానవీయ సంక్షోభాన్ని చాటి చెబుతున్నాయి. ఈ దాడులపై అంతర్జాతీయంగా కూడా ప్రతిస్పందన వినిపించింది. గాజాలోని షాతీ శరణార్థుల శిబిరం (దీనిని బీచ్ క్యాంప్ అని కూడా పిలుస్తారు)పై జరిగిన దాడిలో 500 మంది పాలస్తీనియన్లు మరణించారు. దాదాపు 2,700 మంది గాయపడ్డారు. ఈ దాడులు పాలస్తీనా సాధారణ ప్రజలపై జరుగుతున్న అమానుష దాడులకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. కాగా ఇస్రాయీల్ ఈ దాడులను సమర్థించుకోడానికి హమాస్ పౌరులను మానవ కవచాలుగా వాడుతుందన్న వాదన వినిపిస్తోంది. హమాస్ జనసాంద్రత ఉన్న ప్రాంతాల్లో సైనికసామాగ్రి, ఆయుధాలు దాచి పెడుతుందని, ఆ విధంగా మహిళలు, పిల్లలతో సహా పౌరులను మానవ కవచాలుగా ఉపయోగిస్తుందని ఇజ్రాయెల్ ఆరోపించింది. ఈ ఆరోపణల ద్వారా సాధారణ ప్రజలను చంపడాన్ని సమర్థించుకుంటూ వస్తోంది. హమాస్ పౌరులను మానవ

కవచాలుగా ఉపయోగిస్తుందనే వాదనపై అనేక సందేహాలు వినిపిస్తున్నాయి. అనేక విమర్శలు వస్తున్నాయి. ఇజ్రాయెల్ వాదనలో ప్రధానమైన నాలుగు లోపాలేమిటంటే, ఒకటి - ఇస్రాయీల్ చెబుతున్నట్లు హమాస్ పౌరులను మానవ కవచాలుగా ఉపయోగిస్తున్నట్లు ఆధారాలు లేవు. యుద్ధ ప్రాంతంలో పరిశీలకులు ప్రవేశించే అనుమతులు లేవు. కాబట్టి ఈ వాదనను ధృవీకరించడం సాధ్యం కాదు. ఈ ధృవీకరణ లేకుండా ఇస్రాయీల్ చెబుతున్న మాటలను నమ్మలేం. రెండవ కారణం, ఇస్రాయీల్ అత్యధిక బల ప్రయోగానికి పూనుకుంటోంది. హమాస్ పౌరులను మానవ కవచాలుగా ఉపయోగిస్తుందా లేదా అన్నది పక్కన పెట్టినా, ఇజ్రాయెల్ బలప్రయోగం అత్యధిక స్థాయిలో ఉంది. ఇలాంటి సైనిక చర్యల్లో సాధారణ పౌరులు అత్యధికంగా మరణిస్తారని నిపుణులు వాదిస్తున్నారు. అంతర్జాతీయ చట్టం సైనికచర్యల్లో బలప్రయోగం పరిమితికి మించడం కుదరదు. కాని ఇస్రాయీల్ గాజాలో చేస్తున్నది అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే అంటున్నారు పరిశీలకులు. అంతర్జాతీయ మానవతా చట్టం ప్రకారం యుద్ధం చేస్తున్న సైనికులు, సాధారణ పౌరుల మధ్య తేడాను సైనికదళాలు గుర్తించాలి. ఇజ్రాయెల్ ఈ సూత్రాన్ని పాటించడంలో విఫలమైందని, ఫలితంగా పౌరులు మరణించారని విమర్శకులు పేర్కొన్నారు. పౌర మరణాల సంఖ్య ఎక్కువగా ఉండటం, ఇస్రాయీల్ వైఫల్యాన్ని, అంతర్జాతీయ చట్టాల పట్ల నిర్లక్ష్యాన్ని సూచిస్తుంది. పౌర ప్రాణనష్టాలకు జవాబుదారీతనం లేకపోవడం కూడా ఈ యుద్ధంలో కనబడుతుంది. ఈ జవాబుదారీతనం లేకపోవడం వల్ల ఇజ్రాయెల్ వాదనలకు చట్టబద్ధత లేదని, ఇస్రాయీల్ వాదనలో డొల్లతనాన్ని ఇవి సూచిస్తున్నాయని చాలా మంది వాదిస్తున్నారు. కాగా మరోవైపు ఇజ్రాయెల్ భూ బలగాలు ఉత్తర గాజాలో కార్యకలాపాలను కొనసాగించాయి. నవంబర్ 3న వైద్యసహాయ బృందంపై జరిగిన దాడిలో కనీసం 15 మంది పాలస్తీనియన్లు మరణించారు. UN సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరైన్ ఈ సంఘటనను తీవ్రంగా ఖండించారు. నవంబర్ 3న పాఠశాలలపై, ఆసుపత్రులపై జరిగిన వైమానిక దాడుల్లో కనీసం 35 మంది మరణించారు. ఇస్రాయీల్ దాడుల్లో సాధారణ పౌరులు ఎలా లక్ష్యమవుతున్నారో ఈ దాడులు చెబుతున్నాయి. కనీసం ఆరోగ్యవైద్య బృందాలను కూడా వదలకుండా దాడులు చేయడం జరుగుతోంది. మరోవైపు US విదేశాంగ కార్యదర్శి ఆంటోనీ బ్లింకెన్ టెల్ అవీవ్ మూడవసారి పర్యటించారు. నవంబర్ 3న ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహుతో సమావేశమయ్యారు. జోర్డాన్‌లో అరబ్ నాయకులతో బ్లింకెన్ కాల్పుల విరమణ గురించి చర్చించబోతున్నారు. నవంబర్ 3న హిజ్బుల్లా చీఫ్ హసన్ నస్రల్లా పాలస్తీనా గురించి మాట్లాడారు. US ప్రమేయాన్ని విమర్శించారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత ఆయన చేసిన తన మొదటి ప్రసంగంలో అక్టోబర్ 7న జరిగిన హమాస్ దాడిని ప్రశంసించారు. హిజ్బుల్లా వైఖరి ఈ ప్రాంతంలో మరింత జటిల సమస్యలకు దారితీస్తుందని కొందరు అభిప్రాయ పడుతున్నారు. ఇంకోవైపు ఇజ్రాయెల్ దళాలు వెస్ట్ బ్యాంక్ పై దాడులు ప్రారంభించింది. కనీసం 41 మంది పాలస్తీనియన్లను అదుపులోకి తీసుకున్నారు. నబ్లస్, జెనిన్, హెబ్రాన్, బెత్లెహెం వంటి పట్టణాలలో 143 మంది కంటే ఎక్కువ మంది పాలస్తీనీయులు మరణించారు.

అంతస్తు, రాజ్యాధికారం, సమాజంలో గుర్తింపు, పలుకుబడి, విద్యా నైపుణ్యం, వాక్చాతుర్యం, ధార్మిక ఆధ్యాత్మిక సంస్థల్లో బాధ్యతలు– ఇవన్నీ విశ్వాసికి కఠినమైన పరీక్షలు. **“ధర్మ సంస్థాపనం”** జీవిత లక్ష్యంగా భావించి ఇస్లాం ఉద్యమంలో పాల్గొన్న వారిలో అల్లాహ్ పట్ల భయభక్తులు లేకపోతే, అల్లాహ్ ప్రసన్నత పొందడమే వారి జీవిత ధ్యేయం కాకపోతే, పరలోక సాఫల్యాన్ని వారు కాంక్షించకపోతే ఉపద్రవాల సుడిగుండంలో చిక్కుకునే ప్రమాదం ఎల్లప్పుడూ పొంచి ఉంటుంది. ఉపద్రవాల సుడిగుండంలో చిక్కుకు పోకుండా ఉండడానికి జీవిత చివరి ఘడియ వరకు సురక్షితంగా గౌరవంగా ధర్మసంస్థాపన మార్గంలో నడవటానికి ఇలా అల్లాహ్‌ను ప్రార్థిస్తూ ఉండాలి.

“ఫాతిరస్సమావాతి వల్ అర్జి అంత వలియ్యీ ఫిద్దున్‌యా వల్ ఆఖిరతి తవఫ్ఫనీ ముస్లిమన్ వ్వ అల్‌హిఖ్‌నీ బిస్సాలిహీన్”

‘(ఓ భూమ్యాకాశాల సృష్టికర్తా! ఇహంలోనూ, పరంలోనూ నువ్వే నా సంరక్షకుడవు. ముస్లింగా ఉన్న స్థితిలోనే నాకు మరణం వొసగు. నన్ను సజ్జనులలో చేర్చు)” (ఖుర్‌ఆన్ – 12 : 101)

**- అబ్దుల్ ఖాదిర్ ఉమ్రీ**

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది** **ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**53 ఆయత్‌లు** **మక్కా అవతరణ**

# 42. అష్ షూరా

23 – ఇదీ అల్లాహ్ తన దాసులకు, నమ్మి సదాచరణ చేసే వారికి ఇచ్చే శుభవార్త. ప్రవక్తా ఈ జనులకు చెప్పివెయ్యి. నేను ఈ పనికి మీ నుండి ఎటువంటి ప్రతిఫలాన్ని కోరడం లేదు, అయితే బంధుత్వ ప్రేమను తప్పక కోరుకుంటున్నాను.[41] ఎవరు మంచిని సముపార్జించుకుంటారో వారికి ఆ మంచితనంలో మేము మేలును వృద్ధిపరుస్తాము. నిస్సందేహంగా అల్లాహ్ ఎంతో మన్నించేవాడు, విలువ నిచ్చేవాడు.

41. మూలంలోని పదాలు **'ఇల్లల్ మవద్దత ఫిల్ ఖుర్బా'** అన్నవి. అంటే నేను మీ నుండి ఎటువంటి ప్రతిఫలాన్నీ కోరడంలేదు అయితే కుర్బా ప్రేమను మటుకు తప్పక ఆకాంక్షిస్తున్నాను అని భావం. కుర్బా అనే అరబీ పదానికి వ్యాఖ్యానంలో వ్యాఖ్యాతల మధ్య అనేక విభేదాలున్నాయి.

ఒక వర్గం దాన్ని "బంధుత్వం" అనే అర్థంలో గ్రహిం చింది. తదనుగుణంగా ఈ ఆయత్ భావం ఇలా చెప్పారు, "నేను ఈ పనికి మీ నుండి ఎటువంటి ప్రతిఫలాన్నీ కోరడం లేదు. అయితే ఒకటి మాత్రం తప్పనిసరిగా కోరుకుంటున్నాను. మీరు (అంటే కురైష్ ప్రజలు) కనీసం మీకూ నాకూ మధ్యనున్న బంధుత్వాన్నయినా కాస్త పరిగణనలోకి తీసుకోవాలి. మీరు నా మాట అసలు పూర్తిగా స్వీకరించవలసింది. స్వీకరించక పోతే పోనీ మొత్తం అరేబియా అంతటిలో మీరే నా శత్రుత్వానికి పూనుకున్నారే, ఇంతటి దుర్మార్గానికి పాల్పడవలసింది కాదే." ఇది అబ్దుల్లా బిన్ అబ్బాస్ వ్యాఖ్యానం. దీన్ని అనేకమంది ఉల్లేఖకుల ద్వారా ఇమామ్ అహ్మద్, బుఖారీ, ముస్లిమ్, తిర్మిజీ, ఇబ్ను జరీర్, తబరాని, బైహకీ, ఇబ్ను సఅద్ ప్రభృతులు ఉటంకించారు. ఇదే వ్యాఖ్యానం ముజాహిద్, ఇక్రిమ, కతాద, సుద్ది, అబూ మాలిక్, అబ్దుర్రహ్మాన్ బిన్ జైద్ బిన్ అస్లమ్, జహ్హాక్, అతా బిన్ దీనార్ తదితర ప్రముఖ వ్యాఖ్యాతలు కూడా ప్రకటించారు.

మరో వర్గం 'కుర్బా' అంటే 'కుర్బ్' అంటే సామీప్యం, 'తఖర్రుబ్' (దగ్గరవడం) అనే భావాన్ని గ్రహించింది. దాని ప్రకారం ఆయత్ భావం వారు ఇలా చెప్పారు, "నేను ఈ పని కొరకు మీ నుండి ఎటువంటి ప్రతిఫలాన్నీ కోరడం లేదు, మీలో దైవానికి సామీప్యం, ఆయన పట్ల అనురాగం ఏర్పడటం తప్ప, అంటే మీరు బాగుపడాలి, కేవలం ఇదే నా ప్రతిఫలం." ఈ వ్యాఖ్యానం హజ్రత్ హసన్ బస్రీ చెప్పినట్లు ఉల్లేఖనాలున్నాయి. కతాదా కూడా దీన్ని సమర్థించినట్లు ఒక ఉల్లేఖనం ఉంది. తబరానీ ఉల్లేఖనం ఒకదానిలో ఇబ్ను అబ్బాస్ కూడా ఈ మాట చెప్పినట్లు ఉంది. స్వయంగా దివ్య ఖుర్‌ఆన్‌లో మరో చోట ఇదే విషయం ఈ పదాలలో వచ్చింది:

"వీరికి చెప్పివెయ్యి, "నేను ఈ కార్యం కొరకు మీ నుండి ఎటువంటి ప్రతిఫలాన్నీ అర్థించడం లేదు, నా అసలు ప్రతిఫలం ఒక్కటే, ఇష్టమయినవారు తమ ప్రభు మార్గాన్ని అవలంబించాలి" (అల్ ఫుర్కాన్ : 57).

మూడవ వర్గం కుర్బా అంటే బంధుగణం అనే అర్థాన్ని గ్రహించింది. దాని రీత్యా ఆయత్ అర్థాన్ని ఇలా చెప్పింది: "నేను మీ నుండి ఈ పనికి ఎటువంటి ప్రతిఫలాన్నీ కోరడం లేదు, నా బంధు గణాన్ని ప్రేమించడం తప్ప." ఈ వర్గంలో కొందరు బంధుగణం అంటే బనీ అబ్దుల్ ముత్తలిబ్‌కి చెందిన వారందరూ అని అంటారు. మరికొందరు కేవలం హజ్రత్ అలీ, ఫాతిమా, వారి సంతానం వరకు మాత్రమే దీన్ని పరిమితం చేస్తారు. ఈ వ్యాఖ్యానం సయీద్ బిన్ జుబైర్, అమ్ర్ బిన్ షుఅయిబ్ ద్వారా ఉల్లేఖించబడింది. కొన్ని ఉల్లేఖనాల ప్రకారం ఇదే వ్యాఖ్యానం ఇబ్ను అబ్బాస్, హజ్రత్ అలీ బిన్ హుసైన్ (జైనుల్ ఆబిదీన్) చెప్పినట్లు కూడా ఉల్లేఖనాలున్నాయి. అయితే అనేక కారణాల వల్ల ఈ వ్యాఖ్యానం ఏ విధంగానూ స్వీకారయోగ్యం కాజాలదు. మొదటి విషయం ఏమిటంటే మక్కా పుణ్యపురిలో అష్ షూరా సూరా అవతరించిన కాలంలో హజ్రత్ అలీ, ఫాతిమాల పెళ్ళి అసలు జరగనే లేదు, ఇక సంతానం కలిగే ప్రసక్తి ఏముందనీ. పోతే బనీ అబ్దుల్ ముత్తలిబ్‌లో అందరూ ప్రవక్త మహనీయులకు తోడుగా నిలువలేదు. వారిలో కొందరయితే బాహాటంగా శత్రువులతో కుమ్మక్కయిన వారున్నారు. అబూలహబ్ శత్రుత్వమయితే ప్రపంచమంతా ఎరిగినదే.

**(41వ పాదసూచిక మిగతా వచ్చే సంచికలో)**

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ

3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్హుమ్) గొప్పదనం

## మహనీయ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) విశిష్టత

**335)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) చెప్పగా తాను విన్నానని హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ(రజి) ఉల్లేఖించారు. ప్రవక్త(స) ఇలా చెప్పారు: "నేను కలలో కొంతమందిని చూశాను. నా సమక్షంలో హాజరుపరచబడిన ఆ వ్యక్తులు చొక్కాలు తొడిగి ఉన్నారు. వారిలో కొందరి చొక్కా కేవలం వారి ఛాతీ వరకు ఉంటే మరి కొందరి చొక్కా అంతకన్నా చిన్నదిగా ఉంది. నా ముందు ఉమర్ కూడా హాజరు పరచబడ్డారు. ఆయన తొడిగిన చొక్కా ఎంత పెద్దదంటే, నడుస్తుంటే నేలకు రాసుకుంటూ ఉంది." ఇది విన్న సహచరమాన్యులు, 'దైవప్రవక్తా! దీనిద్వారా (అంటే ఉమర్–రజి చొక్కా పొడవుగా ఉండటం ద్వారా) మీరు గ్రహించిన విషయం ఏమిటి?' అని అడగ్గా, "దీన్ (ఇస్లామ్ జీవన ధర్మం)"[1] అని దైవప్రవక్త(స) చెప్పారు.

**336)** మిస్వర్ బిన్ మఖ్రమా కథనం: హజ్రత్ ఉమర్(రజి)ను (శత్రువు) గాయపరచినప్పుడు ఆయన ఎంతో వ్యాకులతకు లోనయ్యారు. ఆ క్షణంలో మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) ఆయన్ని ఓదారుస్తూ ఇలా అన్నారు : "ఓ విశ్వాసుల నాయకా! మీరంతగా ఆందోళన ఎందుకు చెందుతున్నారు? మీరు దైవప్రవక్త (సఅసమ్) సహచర్య భాగ్యం పొందినవారు. ఆ సాంగత్య బాధ్యతను కూడా బహు చక్కగా నిర్వర్తించారు. దైవప్రవక్త(స) మిమ్మల్ని వీడిపోతున్నప్పుడు మీ పట్ల ప్రసన్నులై ఉన్నారు. ఆ తరువాత మీరు అబూబక్ర్(రజి) సహచర్యం కూడా పొందారు. ఆయన సహచర్య బాధ్యతను కూడా చాలా చక్కగా నెరవేర్చారు. మిమ్మల్ని వీడిపోతున్నప్పుడు ఆయన కూడా మీ పట్ల సంతోషంగా ఉన్నారు. చివర్లో ముస్లిముల సహచర్యం మీకు ప్రాప్తమయింది. వారి సహచర్య బాధ్యతను కూడా మీరు సజావుగా నిర్వర్తించారు. మీరు వారిని వీడిపోతున్నప్పుడు కూడా వారందరినీ సంతుష్టులై ఉన్న స్థితిలోనే వీడిపోతారనటంలో సందేహం లేదు." అప్పుడు హజ్రత్ ఉమర్(రజి) ఇలా అన్నారు. "అబ్బాస్ పుత్రుడా! నీవు దైవప్రవక్త(స) సహచర్యం గురించి, ఆయన ప్రసన్నత గురించి ప్రస్తావించావు. నిశ్చయంగా ఇది దైవానుగ్రహం. దానిని ఆయన నాపై కురిపించాడు. అలాగే నీవు అబూ బక్ర్(రజి) సహచర్యం గురించి, ఆయన సంతోషం గురించి ప్రస్తావించావు. అది కూడా ఖచ్చితంగా దైవకృపే. ఇకపోతే నాలోని ఏ వ్యాకులతను, ఆందోళనను నువ్వు పసిగట్టావో అది నీ మూలంగా, నీ సహోదరుల చింత కారణంగానే సుమా![1] దైవసాక్షి! ఒకవేళ నా దగ్గర ఈ భూమి నిండా బంగారం ఉన్నా, దానిని నేను దైవశిక్షను ఎదుర్కొనక ముందే పరిహారం (ఫిదియా)గా ఇచ్చి, విముక్తి పొందడానికి ప్రయత్నించేవాణ్ణి."[2]

335-1. అంటే మహనీయ ఉమర్(రజి) గారి ధర్మావగాహన బహు విస్తృతమైనది. ఆయన ఈమాన్ (విశ్వాసం) దృఢమైనది. అంతమాత్రాన ఆయన గారు హజ్రత్ అబూబక్ర్(రజి)ను మించిన వారన్న అర్థం గ్రహించరాదు. ఎందుకంటే ఈ హదీసులో అబూబక్ర్(రజి) ప్రస్తావన రాలేదు.

336-1. అంటే మీపైన పరిపాలకునిగా ఎవడొస్తాడో, మీపట్ల ఎలాంటి వ్యవహారం జరుగుతుందోనన్న ఆందోళన నన్ను పట్టిపీడిస్తోంది.

336-2. సుబ్‌హానల్లాహ్! మహనీయ ఉమర్(రజి) నికార్సయిన విశ్వాసి అయివుండి, లెక్కలేనన్ని సత్కార్యాలుచేసి, దైవప్రవక్త(స) సహచర్యం పొంది కూడా తన అంతిమ పరిణామం గురించి ఇంతగా భయపడుతూ ఉండేవారు. ఎందుకంటే రాజాధిరాజు అయిన అల్లాహ్ నిరపేక్షాపరుడు. ఆశ్రిత పక్షపాతం చూపనివాడు. ఉమర్(రజి) లాంటి న్యాయశీలుడు, ధర్మపరిపాలకుడే దైవసమక్షంలో హాజరు కావటాన్ని తలచుకుని ఇంతగా భయపడినప్పుడు, అపరాధుల మైన మనం మరెంతగా భయపడాలో ఆలోచించండి.





# మూఢనమ్మకాల అంధకార లోయల్లో అరబ్బులు - 2

- ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

## యుద్ధకాముకత

ప్రతి చిన్న విషయంపై  కయ్యానికి కాలుదువ్వటం, తలలు నరుక్కోవటం వారి దృష్టిలో చాలా చిన్న విషయం. ప్రతి తెగ మరో తెగకు శత్రువుగా ఉండేది. ప్రతి కుటుంబం మరో కుటుంబీకుల పట్ల వైరభావం కలిగి ఉండేది. ప్రతి పిల్లవాడు తన తండ్రి హంతకులపై ప్రతీకారేచ్ఛతో పెరిగి పెద్దవాడయ్యేవాడు. యుక్త వయస్సుకు చేరగానే 'ఆ పవిత్ర కార్యాన్ని' నెరవేర్చేవాడు. ఆ విధంగా  ఒక్కో పోరాటం  ఏండ్ల తరబడి కొనసాగేది. ఈ పోరాటాలనే చరిత్రకారులు, సాహితీపరులు **"అయ్యాముల్ అరబ్"** అనేవారు. వాటి సంఖ్య వందల కొలదీ ఉండేది.

ఇస్లాంకు నలభై యాభై ఏండ్ల క్రితం జరిగిన యుద్ధాలివి. వాటిలో బాగా ప్రసిద్ధి చెందినవి హబస్, జియాన్ యుద్ధాలు. ఇంతకీ ఏం జరిగిందంటే ఈ రెండు తెగలవారి మధ్య గుర్రపు స్వారీ పోటీ జరిగింది. ఆ సందర్భంగా ఒక పక్షం వారు పోటీ నిబంధనను ఉల్లంఘించారు. అంతే, యుద్ధం మొదలయింది. అది దాదాపు 40 ఏళ్ళ వరకూ కొనసాగింది. రెండవ ప్రసిద్ధ యుద్ధం హరబ్ బసూస్. బసూస్ అనే ఒక స్త్రీకి చెందిన ఒక ఆడ ఒంటె కులైబ్ బిన్ వాయల్ చేనులో పడి మేత మేసింది. కులైబ్ ఆ ఒంటెపై విల్లు ఎక్కుపెట్టాడు. బాణం వెళ్ళి దాని పొదుగును గాయపరచింది. దానిపై గొడవ జరిగింది. కులైబ్ హతమార్చబడ్డాడన్న వదంతి ఆ తెగవారిలో దావానలంలా వ్యాప్తించింది. దాంతో బకర్-తగ్లబ్ తెగల మధ్య రక్తపాతపు యుద్ధం మొదలయ్యింది. ఉకాజ్ సంతలో సులైమ్- గత్ఫాన్ తెగల సర్దారుల మధ్య సంవాదన జరిగింది. అది చిలికి చిలికి గాలివానగా మారింది. కొన్ని రోజుల తర్వాత అదను చూసి ఒకడు ఇంకొకడిని హతమార్చాడు.  దానికి ప్రతీకారంగా రక్తపుటేరులు ప్రవహించాయి. అలాగే బకర్ - తమీమ్ తెగల మధ్య ఒక మేత ప్రదేశంపై గొడవ మొదలై పెద్ద యుద్ధానికే దారి తీసింది. మదీనాలో ఔస్-ఖజ్రజ్‌లు రెండు సుప్రసిద్ధ తెగలు. వాటి మధ్యన భయంకరమైన యుద్ధాలు జరిగాయి. వాటిలో అత్యంత భయంకరమైనది **'యౌమె బుఆస్'** (బుఆస్ దినం). ఆ రోజు ఇరు తెగలకు చెందిన నాయకులెందరో నేలకొరిగారు. అన్సార్ వర్గం వారు వచ్చి మహా ప్రవక్త(స) సమక్షంలో 'బైఅత్' (విధేయతా ప్రమాణం) చేసిన మీదటే ఈ యుద్ధాగ్ని జ్వాల చల్లబడింది. ఖురైషుల సుప్రసిద్ధ యుద్ధాల పేరు **"అయ్యామె ఫుజ్జార్"**. మరొక ప్రఖ్యాత యుద్ధం పేరు "జీఖార్".

ఇంతకీ చెప్పొచ్చేదేమంటే, చిన్న చిన్న తగాదాలే హత్యాకాండకు దారితీసేవి. ఈ హత్యలతో ప్రతీకారేచ్ఛ రగిలేది. దాంతో ఎడతెగని యుద్ధ పరంపర సాగేది. ఆ యుద్ధాలలో పోరాడటం, చంపటం, చావటం అజ్ఞాన యుగపు కీర్తికి కలికితురాయిగా పరిగణించబడేది.

## మద్యపానం

సకల చెడుగులకు, దౌర్జన్యానికి, నీతి బాహ్యతకు మూలం మద్యం. కాని అరబ్బులలో మద్యపానం ఎంతగా సర్వసామాన్యమై ఉండేదంటే ప్రతి ఇల్లూ ఒక మధుశాలగా మారిపోయింది. ఎవరయినా సారాయి తాగకపోతే అతడొక చవటగా భావించ బడేవాడు. తత్కారణంగా ఇస్లాం ఆవిర్భావానికి ముందు అరేబియాలో సారాయి సేవించని వారు వ్రేళ్ళపై లెక్కించదగిన వారుగా మిగిలిపోయారు. బంధుమిత్రులు ఎవరి ఇంట అయినా గుమిగూడితే చాలు మధువు త్రాపే ప్రక్రియ మొదలయ్యేది. ఆ తర్వాత జూదమాడేవారు. జూదంలో ఒంటెల గెలుపోటములు జరిగేవి. గెలిచినవాడు తాను గెలిచిన ఒంటెల్ని అప్పటికప్పుడే కోయించి విందు ఏర్పాటు చేసేవాడు. ఒక్కోసారి తాగిన మత్తు తలకెక్కిన ఆతిథేయుడు తన ఇంట్లోని ఒంటెల్ని వరుసగా నేల కొరిగించేవాడు. మాంసం వేయించబడేది. చీకులు కాల్చబడేవి. ఆ విధంగా విందు భోజనం చేయించి తమ ఔదార్యంపై గర్వపడే వారు. వారి ముందు పాటలు పాడే స్త్రీలు, నాట్యకత్తెలుండేవారు. అశ్లీల పరాచికాలతో వారిని రెచ్చగొట్టేవారు. అజ్ఞాన కాలపు సుప్రసిద్ధ కవి తిర్ఫా ఇలా అంటున్నాడు–

1. జన సందోహంలో నీవు నన్ను వెతికితే దొరుకుతాను
మధుశాలలో గనక నీవు వేటాడదలిస్తే వేటాడగలవు
2. నీవు నా దగ్గరికి ఎప్పుడొచ్చినా సారాయి పెగ్గు సిద్ధమే
ఒకవేళ నీకు అక్కరలేదనుకుంటే పోనీ
3. నా సదనం మధుపానప్రియులతో నక్షత్రాల్లా మెరుస్తూ ఉంటుంది
సాయంత్రమవగానే గాయని మా వద్దకు కుంకుమ వస్త్రాలలో కదలి వస్తుంది
4. తప్పతాగిన మిత్రులకు ఆమె ఒల్లు తెలియనిది కాదు
ఆమె శరీరంలోని నగ్న భాగాలు ఎంత కోమలమైనవో!
5. పాటపాడు అని మేము ఆమెను కోరినప్పుడు వయ్యారాలు ఒలికిస్తూ మా వైపునకు కదలివస్తుంది
6. నేను ఉదార స్వభావుణ్ణి. బ్రతికివుండగా సారా త్రాగించి దాహం తీర్చుకుంటాను. మనలో అసలు దప్పికగొన్న వాడెవడో చచ్చినాకే తెలుస్తుంది
7. కఠినాత్ముడయినాసరే, ఒక పెగ్గు ఇస్తే చాలు దాని రుచి చూడగానే అతని మనసు మెత్తబడిపోతుంది
8. కర్కశుడైన పిసినారి అయినాసరే ఓ గుక్కెడు తాగితే చాలు అతడు తన సంపదనంతా ధారబోసేస్తాడు

బద్ర్ సంగ్రామంలో ఖురైషు శ్రీమంతులు ఎందరో వధించ బడ్డారు. వారి భోగభాగ్యాలను, గానా బజానాలను స్మరిస్తూ ఒక కవి ఇలా అంటాడు –

"బద్ర్ గోతిలో (అందులో హతుల మృతదేహాలు వేయ బడ్డాయి)
నాట్యకత్తెలు, మధుపానప్రియులు శోకం పాటిస్తున్నారు."

మద్యం అక్కడ ఎంతగా ప్రాచుర్యం పొందిందంటే అరబీ భాషలో మద్యానికి 250 పేర్లుండేవి. అల్లామా ముజదుద్దీన్ ఫేరోజాబాదీ గారు ఆ పేర్ల మీద ఒక పుస్తకమే రాశారు. ఇంటింటా సురా పానపు సదనాలు ఏర్పాటయ్యేవి. పురుషులు, స్త్రీలు, పిల్లలు అందరూ మద్యం సేవించేవారు. ఒక కవి తన భార్యతో ఇలా అంటాడు:

"ఓ ఉమ్మె అమ్ర్! సారాయి పెగ్గును మా దగ్గరి నుండి తొలగిం
చావు. నిజానికి దానిని సర్వ్ చేయాల్సింది కుడివైపు నుంచే."

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) తన లేఖాయంలో – తండ్రి అబ్బాస్ ఇస్లాం స్వీకరించకపూర్వం ఇలా అనేవారని చెప్పారు :

"పూర్తిగా నింపబడిన ఒక పెగ్గు సారా మాకు త్రాపండి."

*(బుఖారీ – యుద్ధాల ప్రకరణం)*

సహీహ్ బుఖారీ, పానీయాల ప్రకరణంలో మహనీయ అనస్ (రజి) గారి ఒక కథనం ఇలా ఉంది: ఇస్లాంలో మద్యపానం నిషేధించబడినప్పుడు ఒక సారాయి సదనం నడుస్తోంది. అందులో అబూ దజ్జానా (రజి), అబూ తల్హా (రజి), సుహైల్ బిన్ బైజా ఆసీనులై ఉన్నారు. నేను అందరికన్నా పిన్న వయస్కుణ్ణి. అందువల్ల అందరికీ సారాయి అందించే పని నాకివ్వబడింది.

సారాయి ఎంత యథేచ్ఛగా త్రాగబడేదో, సొసైటీలోని ఏ స్థాయి ప్రజలు త్రాగేవారో, త్రాగిన మైకంలో ఎలా తూలుతూ ఉండేవారో సహీహ్ బుఖారీలోనే పొందుపరచబడిన ఒక సంఘటన ద్వారా ఊహించవచ్చు. అప్పటికింకా సారాయి నిషేధాజ్ఞలు రాలేదు.

బద్ర్ యుద్ధంలో విజయప్రాప్తిగా హజ్రత్ అలీ (రజి)కి ఒక ఒంటె లభించింది. దైవప్రవక్త (స) తన **'ఖుముస్'**లో నుంచి ఒక ఒంటెను అలీ (రజి)కి కానుకగా ఇచ్చారు. హజ్రత్ అలీ (రజి) వివాహం హజ్రత్ ఫాతిమా (ర.అ)తో జరిగింది. అలీ (రజి) వలీమా విందు ఏర్పాట్లలో నిమగ్నులయ్యారు. అడవికి వెళ్ళి **'ఇజ్ఖర్'** (అనే సువాసనగల గడ్డి)ని తెచ్చి స్వర్ణకారులకు అమ్మి కొంత డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో బయటికి వెళ్ళారు. కాని భరించరాని దృశ్యం ఆయనకు కనిపించింది. తన రెండు ఒంటెల్ని ఎవరో కోసేశారు. వాటి పొట్ట చీల్చి,

గుండెకాయలను తీసేసుకున్నారు. ఈ అఘాయిత్యానికి పాల్పడినదెవరు? అని ఆయన జనులను అడిగితే, దగ్గరలోనే ఉన్న ఆ ఇంట్లో హజ్రత్ హమ్జా (రజి) అన్సార్లతో కలసి సారాయి త్రాగుతున్నారనీ, అక్కడ పాటలు పాడుతూ ఒక నాట్యకత్తె,

“హమ్జా! చూస్తావేంటి, లే, లావుపాటి ఒంటెల వైపునకు వెళ్ళు” అని రెచ్చగొట్టిందని చెప్పారు.

అంతే, హమ్జా రెచ్చిపోయారు. ఖడ్గం చేబూని ఆ ఒంటెల వైపునకు దూసుకుపోయారు. వాటి పొట్టలు చీల్చి కార్జాలను తీసేసుకున్నారు.

హజ్రత్ అలీ (రజి) వెళ్ళి, దైవప్రవక్త (స)కు జరిగినదంతా వివరించి చెప్పారు. దైవప్రవక్త(స)దుప్పటి కప్పుకుని అలీ, జైద్‌తో కలసి సంఘటనా స్థలికి వచ్చారు. ఆ క్షణంలో హమ్జా (రజి) మైకంలో ఉన్నారు. ఆయన దైవప్రవక్త (స)ను ఎగాదిగా చూసి, “రేయ్! మీరంతా నా తండ్రి బానిసలురా!” అని అరిచారు. ఆయన పరిస్థితిని గమనించిన దైవప్రవక్త (స) మారు మాట్లాడకుండా తిరిగి వచ్చేశారు.

హజ్రత్ హమ్జా (రజి) హిజ్రీ 3వ సంవత్సరంలో అమరగతి నొందారు. అప్పటికింకా మద్యపానం నిషేధాజ్ఞలు రాలేదు.

*(మౌలానా సయ్యిద్ సులైమాన్ నద్వీ-రహ్మా- విరచితమైన ‘సీరతున్నబీ’ పుస్తకం 4వ సంపుటం ఆధారంగా)*

**(మిగతా వచ్చే సంచికలో)**


# ఖుర్‌ఆన్ అవగాహనం (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్)

**(1 నుండి 10వ సంపుటం వరకు వివరాలు )**

| సంపుటం | సూరా పేర్లు | సూరాలు | పేజీలు | హదియ |
|---|---|---|---|---|
| 1. | 1. అల్ ఫాతిహా 2. అల్ బకర 3. ఆలి ఇమ్రాన్ | 3 | 266 | 300-00 |
| 2. | 4. అన్ నిసా 5. అల్ మాఇద 6. అల్ ఆన్‌ఆమ్ | 3 | 268 | 300-00 |
| 3. | 7. అల్ ఆరాఫ్ 8. అల్ అన్‌ఫాల్ 9. అత్ తౌబా 10. యూనుస్ 11. హూద్ 12. యూసుఫ్ | 6 | 440 | 300-00 |
| 4. | 13. అర్ రా’ద్ 14. ఇబ్రాహీమ్ 15. అల్ హిజ్ర్ 16. అన్ నహ్ల్ 17. బనీ ఇస్రాయీల్ 18. అల్ కహ్ఫ్ 19. మర్యమ్ 20. తాహా 21. అల్ అన్బియా | 9 | 424 | 400-00 |
| 5. | 22. అల్ హజ్జ్ 23. అల్ మూ’మినూన్ 24. అన్ నూర్ 25. అల్ ఫుర్‌కాన్ 26. అష్ షుఆరా 27. అన్ నమ్ల్ | 6 | 422 | 250-00 |
| 6. | 28. అల్ కసస్ 29. అల్ అన్కబూత్ 30. అర్‌రూమ్ 31. లుక్మాన్ 32. అస్ సజ్దా 33. అల్ అహ్జాబ్ 34. సబా 35. ఫాతిర్ | 8 | 424 | 400-00 |
| 7. | 36. యాసీన్ 37. అస్‌సాఫ్ఫాత్ 38. సాద్ 39. అజ్ జుమర్ 40. అల్ మూ’మిన్ 41. హామీమ్ అస్ సజ్దా 42. అష్ షూరా 43. అల్ అహ్కాఫ్ 44. అద్ దుఖాన్ 45. అల్ జాసియహ్ 46. అల్ అహ్కాఫ్ 47. ముహమ్మద్ | 12 | 456 | 400-00 |
| 8. | 48. అల్‌ఫత్హ్ నుండి 59. అల్ హష్ర్ | 12 | 408 | 400-00 |
| 9. | 60. అల్ ముమ్తహీన నుండి 77 అల్ ముర్సలాత్ | 18 | 412 | 400-00 |
| 10. | 78 అన్ నబా నుండి 114 అన్ నాస్ వరకు | 37 | 420 | 300-00 |

TIP TRUST

**TELUGU ISLAMIC PUBLICATIONS TRUST**

**Central Bank of India, Noor Khan Bazar Branch, Hyderabad**

**A/c. No. 1042789779 IFSC Code. CBIN0282407**

**మరిన్ని వివరాలకు సంప్రదించండి: ✆ 9963498695 , 9985394757**

## 'చరితార్థులు'-2



# మౌలానా ఫజల్ -ఎ-హఖ్ ఖైరాబాది

## (1797-1861)

**25**




**ప్రథమ** భారత స్వాతంత్ర్యసంగ్రామ సమయాన పరాయి ప్రభువుల మీద తిరగబడమని ప్రజలకు పిలుపునిస్తూ విడుదలైన చారిత్రాత్మక ఫత్వా 'ఫత్వా-ఎ-జిహాద్' సృష్టికర్త మౌలానా ఫజల్-ఎ-హఖ్ ఖైరాబాది 1797లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సితాపూర్ జిల్లా ఖైరాబాద్‌లో జన్మించారు. మంచిధారణ శక్తిగల ఆయన తండ్రి షాహ్ అబ్దుల్ అజీజ్ వద్ద విద్యాభ్యాసం ఆరంభించారు. పదమూడు ఏండ్ల వయస్సు నాటికి ధార్మిక-సామాజిక శాస్త్రాలలో ఆరితేరిన ఆయన 18 ఏండ్ల వయస్సులో న్యాయస్థానాధికారిగా ఉద్యోగం చేపట్టారు. 1821లో ఉద్యోగానికి రాజీనామా చేసి ధార్మిక-సామాజిక శాస్త్రాల అధ్యయనం, అధ్యాపనం చేపట్టారు. అనాటి ప్రముఖులు మిర్జా గాలిబ్, ముఫ్తీ సద్రుద్దీన్, బహదుర్ షా జఫర్‌ల సంపర్కంలో గడిపిన ఆయన ఝుజ్జర్ నవాబు కొలువులో చేరారు. ఆ తరువాత అల్‌వార్, సహరన్‌పూర్, టోంక్, రాంపూర్, సంస్థానాలలో పలు పదవులను నిర్వహించి చివరకు 1847లో లక్నో చేరుకున్నారు. 1856లో లక్నో సంస్థానాన్ని ఆంగ్లేయులు ఆక్రమించాక 1857లో ఢిల్లీ చేరుకున్న ఆయన అక్కడి పరిస్థితులను చూసి విచలితులయ్యారు. ఆనాడు చక్రవర్తి బహదూర్ షా జఫర్ పక్షాన పోరాడుతున్న తిరుగుబాటు యోధుల సర్వసైనాధ్యక్షులు బక్త్‌ఖాన్ వినతి మేరకు ఆంగ్లేయల మీద తిరగబడమని ప్రజలకు పిలుపునిస్తూ చారిత్ర్మాక 'ఫత్వా-ఎ-జిహాద్' ను స్వయంగా రూపొందించి విడుదల చేశారు. ఆ ఫత్వాకు స్పందించిన ప్రజానీకం ఆంగ్ల సైన్యాల మీద పెద్ద ఎత్తున విరుచుకపడ్డారు. ప్రజలు, స్వదేశీ యోధులు ఎన్ని త్యాగాలకు సిద్ధపడినా ప్రతికూల పరిస్థితులను అధిగమించలేకపోవడంతో 1857 సెప్టెంబర్ 20న ఢిల్లీ పూర్తిగా కంపెనీ సైన్యాల వశమయ్యింది. మౌలానా ఖైరాబాది లక్నో వెళ్ళి బేగం హజరత్ మహల్ సంస్థానంలో ఉంటూ ఇతర తిరుగుబాటు యోధులతో కలసి ఆంగ్లేయుల మీద పోరుబాటన సాగారు. ఆ ప్రయత్నాలు కూడా విఫలమయ్యాక, తిరుగుబాటు యోధులు అజ్ఞాతంలోకి నిష్క్రమించాక 1858 డిసెంబర్ మూడున ఆంగ్లేయాధికారులు మౌలానా ఫజల్-ఎ-హఖ్‌ను అరెస్టు చేసారు. 1859 మార్చి నాలుగున ఆయనను విద్రోహిగా ప్రకటిస్తూ ఆజన్మ ఖైదును శిక్షగా ప్రకటించి అండమాన్ దీవులకు పంపారు. 1859 అక్టోబర్ ఎనిమిదిన అండమాన్‌లోని సెల్యూలర్ జైలుకు ఆయనను చేర్చిన ఆంగ్లేయాధికారులు పలు శారీరక-మానసిక చిత్రహింసలకు గురిచేశారు. ఆ సమయంలో ప్రథమ భారత స్వాతంత్ర్యసంగ్రామం పూర్వోపరాలను వెల్లడిస్తూ చరిత్ర ప్రసిద్ధిపొందిన 'అల్ సవురతుల్ హిందియా' గ్రంథాన్ని మౌలానా ఫజల్-ఎ-హఖ్ రూపొందించారు. అండమాన్ జైలులో అష్టకష్టాలను భరిస్తూ గడిపిన మౌలానా ఫజల్-ఎ-హఖ్ ఖైరాబాది 1861 అగస్టు 20న కన్నుమూశారు. ❑




**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **'చరితార్థులు' - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం




# ప్రజాభిప్రాయం ఎలా మారుతుంది? ఒక ఉదాహరణ

'జమాఅతె ఇస్లామీ హింద్' మీడియా విభాగం ఆధ్వర్యంలో నవంబర్ 11, 12 తేదీలలో ఢిల్లీ జమాఅత్ కార్యాలయంలో ఒక 'వర్క్ షాప్' ఏర్పాటు చేయబడింది. దేశవ్యాప్తంగా వివిధ భాషలలో జమాఅత్ ఆధ్వర్యంలో నడిచే పత్రికల ప్రతినిధులు, మీడియా సెక్రెటరీలు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. జమాఅతె ఇస్లామీ హింద్ ఏ.పి మహిళా విభాగం నుండి ప్రత్యేకంగా ప్రాతినిధ్యం వహించిన వారిలో రచయిత్రి తహ్‌సీన్ హుమైర్వీ ఒకరు. ఈ వర్క్‌షాపులో మౌలానా రజీయుల్ ఇస్లామ్ నద్వి చేసిన ప్రసంగాన్ని తెలుగు పాఠకుల కోసం సమర్పిస్తున్నారు **శ్రీమతి తహ్‌సీన్ హుమైర్వీ.** ప్రవక్త ముహమ్మద్(స) కన్నా ముందు అరబ్బు తెగల్లో చాలా దురాచారాలుండేవి. అమ్మాయి పుట్టడం అంటే అగౌరవంగా భావించేవారు. అలాంటి సమాజంలో అమ్మాయి పుట్టుకను దైవకారుణ్యంగా భావించే సమాజంలో ప్రజాభిప్రాయం మారడం చరిత్ర కళ్ళారా చూసింది. ఈ వ్యాసంలో ఆ వివరాలు చదవండి. **- ఎడిటర్**

ఆముల్ వుఫూద్ (9వ హిజ్రీ) కాలంలో అరేబియా అంతటి నుండి అనేక తెగలు మదీనా వచ్చాయి. వారు ప్రవక్త(స) చేతుల మీదుగా ఇస్లాం స్వీకరిస్తామని, విధేయత పాటిస్తామని ప్రమాణం చేశారు. వారిలో బనూ తమీమ్ తెగ కూడా ఉంది. ఆ తెగ నాయకుల్లో ఒకరైన ఖైస్ బిన్ ఆసిమ్ (ర) ప్రవక్త సమక్షంలో హాజరై ఇలా విన్నవించుకున్నారు-

'ఓ దైవప్రవక్తా(స)! నేను ఘోర పాపాలు చేశాను. దైవ సన్నిధిలో నాకు మన్నింపు లభిస్తుందా?' అని. అందుకు మహనీయులు(స) ఆయన్ను ఓదార్చారు. క్షమాపణ లభిస్తుందని దిలాసా ఇచ్చారు. అప్పుడు ఖైస్(ర) తన వృత్తాంతం వివరంగా చెప్పుకొచ్చారు-

'ఓ దైవప్రవక్తా! నా తెగ వాళ్ళు ఆడపిల్లలను పుట్టిన వెంటనే సజీవంగా పాతిపెట్టేసేవారు. నేను కూడా నా కూతుళ్ళను అలాగే చేశాను. పుట్టిన వెంటనే గొయ్యి తవ్వి సజీవంగా పూడ్చేసేవాడిని. కానీ ఒక సంఘటన మరవలేకపోతున్నా. నేనొకసారి వ్యాపార

నిమిత్తం సుదూర ప్రయాణానికి బయల్దేరాను. అప్పుడు నా భార్య గర్భవతిగా ఉంది. కొన్నేళ్ల తర్వాత తిరిగొచ్చేసరికి ఇంట్లో ఒక చిన్న పాపను చూశాను. తనకు పుట్టిన బిడ్డ కొన్ని రోజులకే తనువు చాలించిందని, ఇంట్లో ఉన్న ఈ పాప తన బంధువుల్లో ఫలానా వాళ్ళమ్మాయని నాతో నా భార్య(అబద్ధం) చెప్పింది. ఆ అమ్మాయి నాకు చాలా దగ్గరైంది. నాతో ఆడుకునేది. నేనామెతో సరదాగా ఉండేవాణ్ణి. చాలా ఎక్కువగా ఆమెను ప్రేమించేవాణ్ణి. కాస్సేపు ఆమె నాకు కనిపించకుండా ఉంటే ఆందోళన చెందేవాడిని. కొన్ని రోజుల తర్వాత నా హృదయంలో పాప పట్ల ప్రేమ ఏర్పడిందని నా భార్య తలచి, ఆమె నా సొంత కూతురేనని ఒక రోజు చెప్పేసింది. అంతే, నాకు దయ్యం పట్టినట్లయింది. నేనామెను సజీవంగా పాతి పెట్టడానికి ప్రణాళికలు రచించడం మొదలెట్టాను. ఒకరోజు నా భార్యతో 'పాపను సిద్ధం చేయి, నేను బయట తిప్పుకొని వస్తాన'ని అన్నాను. ఆమె అలాగే చేసింది. దారిలో నేనొక పారను తీసుకున్నాను. చాలా దూరం ఎడారిలో ఓ చోట చేరుకున్నాక, నేను నేలను తవ్వడం మొదలెట్టాను.

'నాన్నా! మీరేం చేస్తున్నారు?' అని అమ్మాయి అడిగింది. నేను మౌనం దాల్చాను. తను అటూ ఇటూ నా చుట్టూ తిరుగుతోంది. గొయ్యి తవ్వేటప్పుడు నా దుస్తులకు మట్టి అంటుకుంటుంటే తాను మట్టి దులిపేది. ఒక్కోసారి 'నాన్నా! మీరు చాలా అలసి పోయారు. కాస్సేపు విశ్రాంతి తీసుకోండ'ని చెప్పేది. నేను నాకు అవసరమైనంత గుంత తవ్వినాక బయటకొచ్చి పాపను పట్టుకొని అందులో పడేశాను. గబగబా పైనుంచి మట్టి వేయడం మొదలెట్టాను. పాప ఏడ్వడం మొదలెట్టింది. నా చెవుల్లో ఇప్పటికీ ఆమె గొంతు విన్పిస్తోంది. 'నా ప్రియమైన నాన్న మీరేం చేస్తున్నారు? నాకు దెబ్బలు తగులుతున్నాయి. నాన్నా! నేను మట్టిలో కూరుకుపోతున్నాను. నాన్నా! నాకు ఊపిరాడట్లేదు. నాన్నా! నేను చనిపోతాను' అని అంటూనే ఉంది. ఆ సమయంలో నాకు పిచ్చి పట్టింది. నాపై పైశాచికత్వం నాట్యమాడుతుంది. నేను గుంతలో మట్టి వేస్తూనే పోయాను. చివరకు పాప శరీరం మొత్తం మట్టిలో పూడ్చబడింది. క్రమేణా ఆమె గొంతు కూడా మూగబోయింది.

ఈ సంఘటనను వినిపిస్తూ ఆయన వెక్కివెక్కి ఏడ్వడం మొదలెట్టారు. దైవప్రవక్త (స) నయనాల నుంచి అశ్రువులు ప్రవహించసాగాయి. ప్రవక్తా(స)! నా పాపాలకు ఏదైనా ప్రాయశ్చిత్తం ఉందా? అని అడిగారాయన. నీవు ఎంతమంది ఆడపిల్లలనైతే సజీవ సమాధి చేశావో అంతేమంది బానిసలకు స్వేచ్ఛను ప్రసాదించు అని ప్రవక్త బదులిచ్చారు.

(అల్ బజ్జార్ 1/60, అత్ తబ్రానీ ఫిల్ ము'జమిల్ కబీర్ 18/337, అల్ హైసమీ, మజ్ మవుజ్జవాయిద్ 7/283, అల్ అల్బానీ, సిల్ సిలతుల్ అహాదీస్సి స్సహీహ 3298)

ఈ సంఘటన ద్వారా అరబ్బులోని తెగల్లో ప్రవక్త (స) రాకపూర్వం ఆడపిల్లలను సజీవంగా పాతిపెట్టే ఆచారం కొనసాగుతుండేదని తెలుస్తుంది. చరిత్రపుటల్లో బనూ తమీమ్, బనూ ముజిర్, బనూ ఖుజాఅ లాంటి తెగల పేర్లు కనిపిస్తాయి. అమ్మాయి పుట్టడం అవమానంగా భావించేవారు. వారు ఈ దురాచారాన్ని పాటించే వారు. అమాయక బాలికలను సజీవంగా భూమిలో పాతి పెట్టడంలో వారికి ఎలాంటి సిగ్గు ఉండేది కాదు. కొందరు దీన్ని వ్యతిరేకించి, ఆడపిల్లలను రక్షించడానికి ప్రయత్నించేవారు. కాకపోతే వారి ప్రయత్నాలు వ్యక్తిగతంగానే ఉండేవి తప్ప ఇతర తెగలు మౌనం పాటించేవి. ఈ దురాచారానికి వ్యతిరేకంగా ఎవరూ ఏ ఉద్యమం కూడా నడిపించలేకపోయారు. అలాంటి వాతావరణంలో ఇంతటి దుష్ట ఆచారాన్ని అంతమొందించడానికి ఇస్లామ్ ఎలాంటి ప్రయత్నాలు చేసింది? చివరాఖరికి దాని మూలాలను పెకలించి పారేయడమే కాకుండా, ఆడపిల్లల పుట్టుక, పెంపకాన్ని గౌరవ మర్యాదలుగా భావించే విధంగా అదెలా ప్రయత్నించింది? ఈ వ్యాసంలో ఈ ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి ప్రయత్నించడం జరిగింది. దీనివల్ల ఒక విషయంలో ప్రజాభిప్రాయాన్ని ఎలా మార్చవచ్చునో, అందుకోసం ఏ రంగాల్లో పని చేయాల్సిన అవసరం ఉందో స్పష్టమవుతుంది. ఈ దురాచారాన్ని రూపుమాపటానికి అనేక రంగాల్లో కృషి జరిగింది.

ఖుర్ఆన్ గ్రంథంలో వివిధ కోణాల నుండి, వివిధ వివరణల ద్వారా దాని చెడును పదేపదే వివరించడం జరిగింది. దైవ ప్రవక్త(స) తన ప్రవచనాల ద్వారా ఈ ఆచారాన్ని తీవ్రంగా ఖండించారు. దాన్ని ఘోరపాపంగా ప్రకటించారు.

ఆయన(స) ఆడపిల్లలకు ప్రాధాన్యతనిచ్చారు. వారి పెంపకం స్వర్గానికి సోపానంగా, నరకం నుండి విముక్తి సాధనంగా అభివర్ణించారు. ఇలా ఆయన చేసిన నిరంతర ప్రయత్నాలతో ఈ దురాచారం పూర్తిగా నిర్మూలించబడింది. క్రింద ఈ వ్యాసానికి సంబంధించిన కొన్ని ఖుర్ఆన్ వాక్యాలు, హదీసులు ఇవ్వబడ్డాయి.

## ఖుర్ఆన్ ఉపదేశాలు

1- పవిత్ర ఖుర్ఆన్ సంతాన హత్యను బహుదైవారాధకుల లక్షణంగా ఖరారు చేసింది.

"ఇదే విధంగా చాలామంది ముష్రిక్కులకు తమ సంతాన

హత్యను, వారు నిలబెట్టిన భాగస్వాములు సరైనదిగా కనిపించేలా చేశారు.'' (అల్ అన్ఆమ్: 137)

2- సంతాన హత్య మూర్ఖత్వం, అజ్ఞానం, నష్టానికి గురి చేసే చర్యగా ఖరారు చేయబడింది.

“అజ్ఞానం వల్ల, మూర్ఖత్వం వల్ల తమ సంతానాన్ని హత్య చేసిన వారూ.... నష్టానికి గురి అయ్యారు. (అల్ అన్ఆమ్:140)

3- సంతాన హత్య నుండి ముస్లింలను కఠినంగా వారించింది ఖుర్ఆన్.

“పేదరికానికి భయపడి మీ సంతానాన్ని హత్య చేయకండి. మేము మీకూ ఉపాధినిస్తున్నాము. వారికీ ఇస్తాము.'' (అల్ అన్ఆమ్:151)

“పేదరికానికి భయపడి మీరు మీ సంతానాన్ని హత్య చేయకండి. మేము వారికీ ఉపాధిని ఇస్తాము, మీకూ ఇస్తాము. వాస్తవానికి వారిని హత్య చేయడం మహాపరాధం'' (బనీ ఇస్రాయీల్: 31)

4- సంతానాన్ని హత్య చెయ్యబోమని స్త్రీల నుండి ప్రమాణం తీసుకోబడింది-

“తాము ఎవరినీ అల్లాహ్‌కు సాటిగా నిలబెట్టము అనీ, దొంగతనం చేయము అనీ, వ్యభిచారం చేయము అనీ, తమ సంతానాన్ని హత్యచేయము అనీ'' ప్రమాణం తీసుకోబడింది. (అల్ ముమ్ తహినహ్:12)

5- ఆడపిల్లలను హత్య చేసేవారిని ఇస్లామ్ తీవ్రమైన పదజాలంతో ఖండించింది.

“వారిలో ఎవడికైనా కూతురు పుట్టినదనే శుభవార్తను అందజేస్తే అతడి ముఖాన్ని నల్లని ఛాయలు ఆవరిస్తాయి. అతడు లోలోన కుమిలిపోతాడు. ఈ దుర్వార్త విన్న తర్వాత ఇక లోకులకు ఎలా ముఖం చూపాలి అని అతడు నక్కినక్కి తిరుగుతూ ఉంటాడు. అవమానాన్ని భరిస్తూ కూతుర్ని ఇంట్లో ఉంచుకోవాలా లేక ఆమెను మట్టిలో పాతిపెట్టాలా? అని ఆలోచిస్తాడు.'' (అన్ నహ్ల్:58,59)

“అసలు పరిస్థితి ఏమిటంటే, వారు కరుణామయుడైన దేవునికి అంటగట్టే సంతానమే వారిలోని ఒకడికి కలిగిందనే వార్త అందజేస్తే, అతడి ముఖం నల్లబడిపోతుంది, అతడు దుఃఖంలో మునిగిపోతాడు.'' (అజ్ జుఖ్రుఫ్:17)

6- అమ్మాయిలను చంపే వారికి పరలోక శిక్ష ప్రకటించబడింది.

“సజీవంగా పాతిపెట్టబడిన బాలికను, నీవు ఏ తప్పువల్ల హత్య చేయబడ్డావని'' అడగడం జరుగుతుంది. (అత్ తక్వీర్: 8,9)

## ప్రవక్త ప్రవచనాలు

1- దైవప్రవక్త ఆడపిల్లలను సజీవ సమాధి చేయడాన్ని ఘోర పాపంగా పరిగణించారు.

“తల్లుల పట్ల అవిధేయత చూపడాన్ని, ఆడపిల్లలను సజీవ సమాధి చేయడాన్ని అల్లాహ్ నిషేధించాడు.'' (బుఖారీ: 2408, ముస్లిం: 1715)

2- అమ్మాయిలను ద్వేషించడాన్ని వారించారు. వారి ప్రాముఖ్యతను వివరించారు.

“అమ్మాయిలను ద్వేషించకండి. వారు ప్రేమగల వాళ్ళు. చాలా విలువైన వాళ్ళు'' అని అన్నారు. (అహ్మద్: 17373)

3- ఆడపిల్లలను సజీవంగా పాతిపెట్టకుండా, వారిని పోషించినందుకు స్వర్గ శుభవార్తను అందజేశారు.

“ఏ వ్యక్తికైనా ఆడపిల్ల ఉండి, అతనామెను సజీవ సమాధి చేయకుండా, ఆమెను చిన్నచూపు చూడకుండా, ఆమెపై మగ పిల్లవానికి ప్రాధాన్యత ఇవ్వకుండా ఉంటే అల్లాహ్ అతణ్ణి స్వర్గంలో ప్రవేశింపజేస్తాడు.'' (అబూ దావూద్: 5146)

“ఏ వ్యక్తికైనా ముగ్గురు అమ్మాయిలు ఉండి, అతను వారివల్ల కలిగే కష్టాలను సహించి, తన స్థోమత ప్రకారం వారికి తినిపించి, త్రాగించి, తొడిగించినట్లయితే, వారు అతణ్ణి నరకాగ్ని నుండి కాపాడే తెరగా మారుతారు.'' (ఇబ్నె మాజ: 2947)

4- విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా (ర) వివరించారు: నా దగ్గరకు ఒక బిచ్చగత్తె తన ఇద్దరు కూతుళ్లను వెంట తీసుకొని వచ్చింది. నేను ఆమెకు మూడు ఖర్జూర పండ్లు ఇచ్చాను. ఆమె రెండు ఖర్జూర పండ్లు ఇద్దరు కూతుళ్లకు చెరొకటి ఇచ్చి, మిగిలిన ఒక ఖర్జూర పండును తన నోట్లో వేసుకోబోయింది. ఆ ఇద్దరు పిల్లలు అది కూడా ఇచ్చేయమని అడిగారు. ఆమె ఆ ఖర్జూరాన్ని రెండు ముక్కలుగా చేసి వాళ్ళిద్దరికీ చెరో ముక్క ఇచ్చేసింది. ఆమె చేసిన ఈ పని నాకు చాలా నచ్చింది. దైవప్రవక్త(స) వచ్చినప్పుడు నేను ఈ విషయాన్ని ప్రస్తావించాను. దానికాయన (స), దేవుడు ఆమె చేసిన పనికి మెచ్చుకొని ఆమె కోసం స్వర్గం తప్పనిసరి చేశాడు. (లేదా ఆయన, దేవుడు ఆమెకు నరకాగ్ని నుండి విముక్తినిచ్చాడు) అని అన్నారు. (ముస్లిం: 2630)

5- ఆడపిల్లల పట్ల ప్రేమను వ్యక్తపరిచారు-

దైవప్రవక్త (స), తన ముద్దుల తనయ ఫాతిమా(ర)ను అమితంగా ప్రేమించేవారు. ఫాతిమా 'నా గుండె ముక్క' అని ఆయన(స) అన్నారు. ఈ అవ్యాజానురాగం ఆమె వివాహం తర్వాత కూడా

అలాగే ఉండింది. ఆమె తండ్రిని కలవడానికి వచ్చినప్పుడల్లా ఆయన లేచి నిలబడి ఆమెకు స్వాగతం పలికేవారు. ఆమె నుదుటిపై ముద్దు పెట్టుకునేవారు. (బుఖారీ: 3767)

విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఉమ్మె సలమా(ర) కుమార్తె జైనబ్ ఆయన(స) దగ్గరే పెరిగారు. ఆయన ఆ పాపను ఎత్తుకునే వారు, ముద్దు పెట్టుకునేవారు, తన భుజంపై కూర్చోబెట్టు కునేవారు.

ఈ వివరాల ద్వారా రెండు విషయాలు తెలిసొచ్చాయి.

**మొదటిది** : ఏదయినా ఒక విషయంలో ప్రజాభిప్రాయాన్ని మార్చడానికి నిరంతర ప్రయత్నం తప్పనిసరి అవుతుంది. ఒకటి రెండు రచనలు, ఒకట్రెండు ప్రసంగాలు, ఒకటి రెండు ప్రకటనలతో ఎలాంటి ప్రయోజనం చేకూరదు. రాయికి కూడా రంధ్రం వేయవచ్చు,కాకపోతే దానిపై నీటిబొట్టు నిరంతరాయంగా చాలాకాలం పాటు పడాల్సి ఉంటుంది. అలాగే నేడు ప్రజాభిప్రాయాన్ని మలచవలసిన అనేక అంశాలున్నాయి. ఉదాహరణకు తల్లి కడుపులోనే ఆడబిడ్డను చంపేయడం, మద్యం సేవించడం, అంటరానితనం, కులాల మధ్య వివక్ష, వారసత్వ సంపదలో మహిళలకు వాటా ఇవ్వకపోవడం, వివాహాల్లో వృధాఖర్చు పోకడలు మొదలైనవి. ముస్లింల పట్ల తోటి దేశవాసుల్లో చాలా అపార్థాలే ఉన్నాయి. వాటిని మార్చే ప్రయత్నం చేయొచ్చు.

**రెండోది** : ప్రజాభిప్రాయాన్ని మలచడంలో మీడియా పాత్ర చాలా కీలకమైంది. సోషల్ మీడియా ప్రతి ఇంటి లోపలకు, ప్రతి వ్యక్తి చెంతకు చేరుతుంది. అంచేత వివిధ కార్యక్రమాల ద్వారా, భిన్న ప్రయత్నాలు చేయడం ద్వారా మన సందేశాన్ని చాలా దూరం వరకు చేరవేయవచ్చు....

# రచయిత సమాజానికి దిక్సూచి లాంటివారు

## జమాఅతె ఇస్లామీ ఆం.ప్ర. రాష్ట్ర అధ్యక్షులు రఫీక్

నంద్యాల సమద్ రచించిన
మూడు పుస్తకాలు
ఆవిష్కరణ



నంద్యాలకు చెందిన ప్రముఖ రచయిత అబ్దుల్ సమద్ గారు రచించిన “అంతర్వేదన”, “ఇస్లాం తరంగాలు”, “క్షిపణి” పుస్తకాలను ఇటీవల నేషనల్ పీజీ కాలేజిలో ఘనంగా ఆవిష్కరించారు. జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షులు రఫీక్ అహమ్మద్, ఉర్దూ అకడమి ఏపి మాజీ ఛైర్మన్ డా.నౌమన్, ప్రముఖ పారిశ్రామికవేత్త వాహెద్ హుసేన్ ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. జాతీయ ముస్లిం రచయితల సంఘం అధ్యక్షులు కవి కరీముల్లా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ ముస్లిం రచయితల సంఘం కన్వీనర్ కవి అబ్దుల్ రషీద్, ప్రముఖ న్యాయవాది వి.రామచంద్రారావు, జమాఅతె ఇస్లామీ హింద్ రాష్ట్ర కార్యదర్శి ముహమ్మద్ కరీముద్దీన్, న్యాయవాది శంకరయ్య, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సలాముల్లా, అడ్వకేట్ డా.బాలస్వామి, ఆల్మేవ రాష్ట్ర సలహాదారు ముహమ్మద్ అబులైస్, రచయిత్రి శ్రీమతి రత్న కుమారి, అపూట రాష్ట్ర కన్వీనర్ అబ్దుల్ అజీజ్, డా.కళామురళి, నూర్ అహమ్మద్ మదని, గనీమియ్య తదితరులు పాల్గొన్నారు. అరసం నంద్యాల జిల్లా అధ్యక్షులు ఎస్.ముర్తుజా, మురసం నంద్యాల జిల్లా అధ్యక్షులు, కవి కరీముల్లా పుస్తకాలపై సమీక్షలు చేశారు. సమద్ కథలు, వ్యాసాలు, అబాబీల్ కవితలు సమాజానికి మరీ ముఖ్యంగా యువతకు ఉపయుక్తం అన్నారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ, కవి సముద్రాన్ని కూజలో నింపే సమర్థులని, సమాజానికి మార్గదర్శక చేసే దిక్సూచి లాంటివారని, సమద్ తన అనుభవాలు, సమాజంలోని రుగ్మతలు దూరం చేయడానికి నిరంతరం తపిస్తుంటారన్నారు. కవి కరీముల్లా ముస్లిం రచయితల సంఘం ఆవిర్భావాన్ని ప్రస్తావిస్తు ఇస్లాంపై ఉన్న అపోహలు దూరం చేస్తూనే పీడిత ప్రజల కోసం, దేశ సౌభ్రాతృత్వం కోసం తమ కలాలు కదలిస్తారని అలాంటి ధ్యేయంతో సమద్ రచనలు చేస్తున్నారని విశ్లేషించారు. అనంతరం రచయిత సమద్‌ను ఘనంగా సత్కరించారు. సమద్ మాట్లాడుతూ తన రచనలను గీటురాయి సంపాదకీయం ఆదరించడం వల్లనే తాను రచయితగా ఎదగగలిగానని, సమాజం పట్ల బాధ్యత తనను రచనలు చేయుటకు ప్రోత్సహించింది అని తన భావనలు పంచుకున్నారు.



# యుద్ధ జ్వాలల్లో మసిబారుతున్న బాల్యం

డా.మహ్మద్ హసన్, సహాయ ఆచార్యులు, రాజనీతి విశ్లేషకులు

**"లేతబుగ్గల** పాలనవ్వుల మురిపాల పాపా! నీ కంటిమీదకు కునుకెలా వస్తుందో నాకు తెలుసు దివ్యలోకపు అంతరాంతరాలలో ఒక మారుమూల గది నుంచి ప్రవహిస్తోంది నీ కనులపై కాంతి ఓ పాపా! నిద్రలో పరవశిస్తున్న నీ పెదాలపై పారాడే చిరునవ్వు దానికి పుట్టిల్లేదో తెలుసా ఎవరికైనా దాన్ని గురించి చెప్ప మంటావా! చవితిరోజు చంద్రుని నుంచి విడిపోయిన ఒక జాబిలి కిరణం విస్తరిస్తున్న వసంత మేఘపు అంచుని స్పృశిస్తే మంచుకోసం నిరీక్షించే ఒకానొక ప్రభాతాన పుట్టిందట ఆ చిరునవ్వు" ఈ వాక్యాలు విశ్వ కవి రవింద్రనాద్ ఠాగూర్ గారి "గీతాంజలి" కావ్యం లోనివి. పైపంక్తుల ప్రకారం పసిపిల్లల మలినంలేని ప్రవర్తన, మనస్తత్వాలు, వారి ఆలోచన విధానం ప్రత్యేకమైనది. తల్లితండ్రులుగా మనం కేవలం వారికి పర్యవేక్షలుగా, మార్గదర్శ కాలుగా మాత్రమే ఉండగలం. 1959లో ఐక్యరాజ్య సమితి సాధారణ సభ ఒక డిక్లరేషన్ విడుదల చేసింది దానిలో పిల్లల రక్షణ, విద్య, ఆరోగ్యం, శ్రద్ధ, పునరావాసం, ఆశ్రయం, మంచి పౌష్టికమైన ఆహారం కల్పించాలని ప్రపంచదేశాలను కోరింది. అలాగే 2001-2010 సంవత్సరాల దశాబ్ద కాలాన్ని అంతర్జాతీయ సంస్కృతి, శాంతి, అహింసలతో కూడిన పిల్లల ప్రపంచాన్ని సృష్టించాలని ప్రపంచ దేశాలని కోరింది. ఇక ప్రపంచ శాంతి పరిరక్షణ కోసం ఏర్పడిన ఐక్యరాజ్య సమితి కూడా ప్రత్యేకంగా బాలల కోసం 1946లో అంతర్జాతీయ బాలల అత్యవసర నిధిని (UNICEF) ఏర్పాటు చేయటం జరిగింది. దీని లక్ష్యం అభివృద్ధి

చెందుతున్న దేశాలలో పిల్లలకు, వారి తల్లులకు జీవన ప్రమాణాలు పెంచటం ఈ సంస్థ ముఖ్య ఉద్దేశ్యం. అలాగే సచిన్ టెండూల్కర్ లాంటి ప్రముఖ వ్యక్తులను రాయబారులుగా నియమించుకొని ఆ సంస్థ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం విదితమే.

యూనిసెఫ్ (UNICEF) ప్రపంచవ్యాప్తంగా చేసిన, చేస్తున్న సేవకు గాను 1965లో "నోబెల్ శాంతి బహుమతి"ని కూడా పొందింది. కానీ ఇటివలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు చూస్తే బాలల హక్కులు ప్రమాదంలో పడుతున్నట్లుగా భావించాలి. మొదటి రెండు ప్రపంచ యుద్ధాలలో జరిగిన ప్రాణ నష్టం, ఆస్తి నష్టం చరిత్రలో మళ్ళీ జరిగనప్పటికి అంతర్జాతీయంగా చేసుకున్న ఒప్పందాలు, చట్టాలు, ఏర్పడిన శాంతి సంస్థలు వాటి లక్ష్యం ప్రస్తుతం ప్రమాదంలో పడినట్లుగా భావించాలి. అంతెందుకు రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా జపాన్‌లోని హిరోషిమ (1945 ఆగష్టు 06) నగరంపై వేసిన అణుబాంబు అనంతరం నాగసాకి పట్టణంపై (ఆగష్టు- 9న) వేసిన రెండో అణుబాంబు ద్వారా అరవై వేల నుండి ఎనభై వేల దాకా మరణించి ఉండొచ్చని, హిరోషిమా దాడిలో ఐతే డెబ్బై వేల నుండి సుమారు ఒక లక్ష ఇరవై ఆరు వేల వరకు సాధారణ పౌరులు మరణించి ఉంటారని అంచన. దీనిలో పిల్లలు, మహిళలు సగం మంది బాదితులే అనేది చారిత్రక సత్యం కూడా. అనంతరం ఈ స్థాయి యుద్ధాలు కాని యుద్ధ పరిణామాలు కాని ప్రపంచవ్యాప్తంగా జరగనప్పటికి దేశాలలోని అంతర్గత సమస్యల వల్ల (లిబియా, అఫ్ఘనిస్తాన్, సిరియా) పొరుగు దేశాలతో సరిహద్దు సమస్యలు, ప్రాబల్య రాజకీయాల కోసం జరుగుతున్న చిన్నచిన్న యుద్ధాలతో వందలాది మంది చిన్న పిల్లలు నాటి నుండి నేటి రష్యా-యుక్రెయిన్ యుద్ధం కావచ్చు, లేదా "హమాస్" తిరుగుబాటు దారులకు ఇజ్రాయిల్ సైన్యానికి ప్రస్తుతం జరుగుతున్న యుద్ధం కావచ్చు. ఇందులో ప్రధానంగా బలయ్యేది చిన్నపిల్లలు కావటం బాధ కల్గించే అంశం.

ఆయా దేశాలు యుద్ధ సమయాలలో అంతర్జాతీయంగా చేసుకున్న చట్టాలు కాని, ఒప్పందాలు కానీ అమలు చేయకుండా, వాటిని పాటించకుండా అమానవీయంగా ప్రవర్తించటం అనేది మానవత్వానికే మచ్చ. గాజా కేంద్రంగా పరిపాలిస్తున్న "హమాస్" అక్టోబర్ 7న ఇజ్రాయిల్‌పై అకస్మాత్తుగా సుమారు ఆరు వేల మోర్టార్ షెల్స్‌ను, రాకెట్లను ప్రయోగించటం వల్ల ఇజ్రాయిల్ సైన్యం పాలస్తీనాపై యుద్ధం ప్రకటించింది. ఈ నెలన్నర రోజుల యుద్ధంలో చిన్నపిల్లలే అధికంగా చనిపోయారని ఐక్యరాజ్య సమితి నిర్వహిస్తున్న శరణార్థి శిబిరాల నుండి వస్తున్న సమాచారం. ఇప్పటి వరకు అధికారికంగా పాలస్తీనా నుండి పన్నెండు వేలకుపైగా మరణించారని పాలస్తీనా ఆరోగ్య శాఖ తెలియజేసింది. అందులో చిన్న పిల్లల మరణాలు సుమారు ఆరు వేలు దాటినట్లు నివేదికలు తెలియజేస్తున్నాయి. మిగతా వారు వృద్ధులు, మహిళలు వివిధ కారణాల చేత సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్ళలేని వారు ఉంటారనేది ప్రాథమిక అంచనా. ఇక శిథిలాల్లో గల్లంతైన 2500 మంది పౌరుల్లోను చిన్నారుల సంఖ్య వెయ్యి దాకా ఉంటుందని గాజా ఆరోగ్య శాఖ చెబుతోంది.

ప్రస్తుతం గాజాలో డెబ్బై ఐదు శాతం భవనాలు పూర్తిగా ధ్వంసం కాగా, యాభై శాతంపైగా పాఠశాల భవనాలు ధ్వంసం అయినట్లు అధికారుల అంచన. శిబిరాలలోని బాధితులకు త్రాగునీరు, ఆహారం దొరకక ఆహార నిల్వల కేంద్రాలపై లూఠీ చేస్తున్నారంటే పరిస్థితి ఎంత హృదయ విదారకంగా ఉందో గమనించవచ్చు. ప్రస్తుతం పాలస్తీనాలోని ఆస్పత్రులు, అంబులెన్సులు, శరణార్థి శిబిరాలు పాఠశాలలపై బాంబుల వర్షం కురిపించి అమానవీయంగా ప్రవర్తించిన ఇజ్రాయిల్ సైన్యం అంతర్జాతీయంగా అపవాదును మూటగట్టుకుంది. ప్రస్తుతం గాజా ప్రాంతంగాని పాలస్తీనాలోని ఏ ప్రాంతం కూడా సురక్షితమైంది కాదు. పత్రికా విలేకరులను, ఐక్యరాజ్య సమితి నిర్వహించే శరణార్థి శిబిరాలలో సహాయం చేస్తున్న ఉద్యోగులను, స్వచ్ఛంధ సంస్థల వాలంటీర్లను కూడా వదలకుండా బాంబుల వర్షం కురిపిస్తుందంటే ఇజ్రాయిల్ సైన్యం ఎంతటి మానవ విధ్వంసానికి పాల్పడుతుందో అర్థం చేసుకోవచ్చు. ఈ యుద్ధంలో క్షతగాత్రులుగా మిగిలిన చిన్నారులు బాంబుల దాడిలో వికలాంగులుగా మారిన పిల్లలు తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల మానసికస్థితి దారుణంగా మారుతోందని ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేస్తోంది. యుద్ధం కారణంగా కూలిపోయిన తమ ఇండ్లను అక్కడే వదిలిన పుస్తకాలను, వారు ఆడుకున్న ఆట వస్తువులను, చనిపోయిన తల్లిదండ్రులను, బడులలోని జ్ఞాపకాలను తలుచుకుంటూ చాలామంది నిద్రకు దూరమవుతున్నారని, చికిత్స పొందేటప్పుడు కూడా అక్కడి దృశ్యాలు హాహాకారాలు చూసి, ఆ మానసిక సంఘర్షణ నుండి ఇంకా బయటపడలేక ఎన్నో నిద్రలేని రాత్రులు గడుపుతూ చివరకు స్మశానంలో శాశ్వతంగా నిద్రపోతున్నారని ఇక బ్రతికున్న పిల్లలు ప్రస్తుతం ప్రత్యక్ష నరకం చూస్తున్నారని యూనిసెఫ్ ప్రతినిధి "జేమ్స్ ఎల్డర్" గాజాను సందర్శించి వ్యక్తం చేసిన మాటలు అవి. అంటే ప్రస్తుతం గాజా ఓ నెత్తుటి గాయాల భూమి అక్కడ పారుతున్న రక్తం, చిద్రమైన శరీర భాగాలు, నేలమట్టమైన

ఇండ్లను చూస్తే ఎవరికైనా హృదయం ద్రవిస్తుంది.



పాలస్తీనా సమస్యను అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకొని వచ్చినా ''హమాస్'' అవలంభించిన దూకుడు చర్య వల్ల ఈరోజు పాలస్తీనాలో ఇజ్రాయిల్ సైన్యం ద్వారా ఇంత విధ్వంసం జరుగుతోంది. పాలస్తీనా పరిస్థితి ఏమిటి? కోలుకోవడానికి కొన్ని దశాబ్దాలు పట్టవచ్చు, చనిపోయిన చిన్నారుల ప్రాణాలను మాత్రం ఎవరు తిరిగి తీసుకొని రాలేరు. ఆ పిల్లలు ఆ ప్రాంతంలో పుట్టి ఏం పాపం చేశారు. వారేమైన ఇజ్రాయిల్ పై క్షిపణులు ఎక్కు పెట్టారా? బాంబుల వర్షం కురిపించారా? తరగతి గదిలోనో, అమ్మ ఒడిలోనో ప్రశాంతంగా ఆడుకునే పసికూనలు వారు. ప్రస్తుతం గాజాలో 16 ఏళ్లలోపు చిన్నారులు 8 లక్షల దాకా ఉండొచ్చని అంచనా, వారంతా యుద్ధాన్ని, యుద్ధ వాతావరణాన్ని పత్యక్షంగా చూస్తున్న వారే, అంటే భవిష్యత్తులో వారి మానసిక స్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇక యుద్ధంలో మరణించిన వారి తల్లిదండ్రులను మర్చిపోవటం అంత సులువైన విషయం కూడా కాదు. వారి భవిష్యత్తు ఏమిటో, వారి రక్షణ, వారి పోషణ ఎవరు చూసుకుంటారనేది ప్రశ్నార్థకంగా మారింది. అలానే పిల్లల్ని కోల్పోయిన తల్లిదండ్రులు కూడా మానసికంగా క్రుంగుబాటుకు లోనయ్యే ప్రమాదం ఉంది. గాజాలో ఈ నెల రోజుల్లోనే సుమారు 5500 మంది చిన్నారులు జన్మించినట్లు, ప్రస్తుతం ఆసుపత్రుల్లో 50 వేల మంది గర్భిణీలు ఉన్నట్లు ఐక్యరాజ్య సమితికి చెందిన ''యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్'' సంస్థ వెల్లడించింది. అంటే యుద్ధ భూమిలోనే ఒక వైపు పిల్లల మరణాలు మరో వైపు జననాలు జరగడం బాధ కల్గించే విషయం. బాలింతలకు పౌష్టికాహారం మాట అటుంచితే రెండు పూటల తిండి దొరకడం కష్టంగా ఉందని ఈ పరిస్థితుల్లో శిశువులు భవిష్యత్తులో పౌష్టిక ఆహార లోపాన్ని, ఇతర రుగ్మతలను ఎదుర్కోవాల్సి వస్తుందని అలాగే యుద్ధం ద్వార వెలువడిన వివిధ రకాల రసయానాలు కూడా పిల్లలపై చెడు ప్రభావం చూపే అవకాశం ఉందని డాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సర్వం కోల్పోయిన ఈ పిల్లలు భవిష్యత్తులో మళ్ళీ హింసాత్మక విధానాల వైపు మళ్ళే అవకాశం కూడా లేకపోలేదని మానసిక విశ్లేషకుల అంచన. ప్రస్తుతం అంతర్జాతీయ సమాజం ఏం చేయాలనేది ప్రశ్న ఇజ్రాయిల్ పాలస్తీనా మధ్య జరుగుతున్న యుద్ధాన్ని తాత్కాలికంగా విరమింపజేసేలా ప్రపంచ దేశాలు ఇరు దేశాలపై ఒత్తిడి చేయాలి. వినని పక్షంలో ఆంక్షలు విధించే ఏర్పాటు చేయాలి. అంతర్జాతీయ చట్టాలకు లోబడి పాలస్తీనా వారు, ఇజ్రాయిల్ ప్రభుత్వం కట్టుబడి ఉండేలా ఐక్య రాజ్యసమితి చొరవ తీసుకొని శాంతి స్థాపనకు కృషి చేయాలి. 1947లో ఐక్యరాజ్య సమితి ప్రతిపాదించిన 181వ తీర్మాణం ప్రకారం ఇజ్రాయిల్ ఆక్రమించిన పాలస్తీనా భూ భాగాలను అప్పగించి యధాతథ స్థితిని అమలు చేసి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా చర్యలు చేపట్టాలి. ఒక వైపు ఇజ్రాయిల్ కు మద్దతుగా అమెరికా తన సైన్యాన్ని పంపి మరొక వైపు శాంతి చర్చల పేరిట హడావుడి చేయడం సభ్య సమాజం తలదించుకునేలా ఉంది. ఇజ్రాయిల్, పాలస్తీనాకు పొరుగు దేశాలైన అరబ్ దేశాలు లేదా ఇతర ప్రపంచ దేశాలు పాలస్తీనాలోని పిల్లలకు సంఘీభావంగా వారికి పౌష్టిక ఆహారం, మందులు, దుస్తులు, త్రాగునీరు సరైన వసతి కల్పించే విధంగా చర్యలు చేపట్టాలి. తమవంతుగా సహకరించాలి కూడా. యుద్ధం ద్వారా మానవ హననం మరియు నాగరికతా విధ్వంసం తప్ప ఏమి సాధించలేం అన్న విషయం ఇరు దేశాలు గమనించాలి.

రష్యా ఉక్రెయిన్ యుద్ధంలో లక్షలాది మంది ఉక్రెయిన్ పౌరులు పొరుగు దేశాలకు వలసవెళ్ళిన చిత్రాలు ఇంకా కళ్ళముందు మెదులుతూనే ఉన్నాయ్ అలాగే అఫ్ఘనిస్తాన్, సిరియా, లిబియా దేశాలలోని అంతర్ యుద్ధాలలో సరిహద్దులు దాటుతున్న పసిపిల్లలను, సముద్రాలు దాటుతూ మరణించిన పసి పిల్లల చిత్రాలను మర్చిపోలేం. అంతెందుకు 1984 డిసెంబర్ 3న మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నగరంలోని ''యూనియన్ కార్బైడ్

ఫ్యాక్టరీ నుండి అర్ధరాత్రి వెలువడిన "మిథైల్ ఐసోసైనడ్" అనే విషవాయువును పీల్చిన పిల్లలు, పెద్దలు రాత్రికి రాత్రే నిద్రలో నుండి శాశ్వత నిద్రలోకి జారుకున్న సంఘటన అందరికి తెలిసినదే. అది జరిగి నాలుగు దశాబ్దాలు దాటిన ఇంకా ఆ విష ప్రభావం ద్వార శారీరక మానసిక వైకల్యంతో నేటికి పిల్లలు జన్మిస్తున్నారంటే నాడు ఎంత దారుణం జరిగిందో దాని ప్రభావం ఏమిటో అర్థం చేసుకోవచ్చు. "మంచి వాతావరణం కల్పించలేని పాలకులు ఉన్నంత కాలం వారి హక్కుల కోసం సంఘర్షణ జరుగుతూనే ఉంటుంది". గత ఎనిమిది దశాబ్దాలుగా జరుగుతున్న ఇజ్రాయిల్ పాలస్తీనా సమస్య ఈ యుద్ధంతోనైనా శాశ్వతంగా సమిసిపోతే ప్రపంచం సంతోషిస్తుంది. లేనిపక్షంలో ఈ యుద్ధ భూమిలో పుట్టిన పిల్లలే పెరిగి పెద్దవారై మళ్ళీ ఇజ్రాయిల్‌పై తుపాకి ఎక్కుపెట్టరని గ్యారంటీ ఏమిలేదు. జర్మనీ నియంత "హిట్లర్" బాల్యంలో ఓ యూదు టీచర్ ద్వార శిక్షింపబడి పెరిగి పెద్దవాడైన తరువాత "జర్మని ఛాన్సలర్"గా పదవిని చేపట్టి లక్షలాది యూదులను చంపిన సంఘటన చరిత్రలో చదివాం. పిల్లల్ని దైవ ప్రసాదంగా భావించే సంస్కృతి మనది అలాంటి పిల్లల్ని కోల్పోయిన తల్లిదండ్రులు, తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు మానసికంగా కోలుకుంటారని ఊహించడం కష్టం. పిల్లల జ్ఞాపకాలు తలుచుకొని తల్లిదండ్రులు, తల్లిదండ్రుల లోటును గుర్తుచేసుకొని పిల్లలు మానసిక కుంగుబాటుకు గురయ్యే ప్రమాదం ఉంది. భవిష్యత్తులో వాళ్ళు హింసాత్మక పద్ధతుల వైపు మల్లే ప్రమాదం కూడా లేకపోలేదు. అలా జరిగితే ఇజ్రాయిల్ పాలస్తీనా సమస్యను మరో వందేళ్ళ వరకు కూడా పరిష్కరించలేం. అందుకే మనుషుల్ని మనుషులు చంపుకోవటం కాదు, కలిసిమెలిసి జీవించే విధానాలను పాలకులు అవలంబించి పాలస్తీనీయన్లు కోరుతున్న భూభాగం వారికే అప్పగించి ఐక్యరాజ్య సమితి చేసిన తీర్మానాలను ఇజ్రాయిల్ గౌరవించి సోదరభావంతో మసలే ప్రయత్నం చెయ్యాలి లేనిపక్షంలో భవిష్యత్తులో మళ్ళీ రెండు దేశాల మధ్య హింస చెలరేగే ప్రమాదం కూడా లేకపోలేదు.

పొరుగున ఉన్న సౌది అరేబియా దేశంతో శాంతి ఒప్పందాలు చేసుకోవాలనుకుంటున్న ఇజ్రాయిల్ తన ప్రక్కనే వున్న "పాలస్తీనా" ప్రజలను శత్రువులుగా చూడటంలో అర్థం లేదు. "హమాస్" కూడా శత్రు దుర్భేద్యంగా ఉన్న ఇజ్రాయిల్‌ను కవ్విస్తే నష్టం ఏ స్థాయిలో ఉంటుందో ఈ యుద్ధం ద్వారానైనా గ్రహించి శాంతి చర్చలకు మొగ్గుచూపి ప్రాణనష్టం జరగకుండా తన పట్టును వీడి బందీలుగా ఉన్న ఇజ్రాయిల్ పౌరులను విడిచిపెట్టాలి. ఇకనైనా రెండు దేశాలు ఒక మెట్టుదిగి హింసకు స్వస్తి పలికి ఇక ముందు కలిసిమెలిసి ప్రపంచానికి ఒక శాంతి సందేశం పంపాలి. అగ్రరాజ్యాలు లేదా అభివృద్ధి చెందిన దేశాలు చిన్న దేశాలపై పెత్తనం చెలాయించాలనుకోవడం, అణుబాంబులను పోగేసు కోవడం కన్నా వాటికి ఐన ఖర్చును పేద దేశాలలోని పసి పిల్లలకు, పాఠశాలలకు, మౌలిక సదుపాయాల కల్పనకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి వారి అభివృద్ధికి పాటుపడాలి. అప్పుడే ప్రపంచంలోని అంతరాలను, పిల్లల్లోని నైపుణ్యాలను పెంపొందించి సమాజంలో వారిని కూడా భాగస్వామ్యులను చెయ్యగలిగిన వారమవుతాం.


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

# మగువ మనుగడ



- ఫరీఫా, విజయవాడ

**ఈనాటి సమాజంలో స్త్రీలు ప్రతి రంగంలోనూ తమ ప్రతిభను కనబరుస్తూనే ఉన్నారు. స్త్రీ తల్లిగా, చెల్లిగా, భార్యగా, కుమార్తెగా ఎన్నో రూపాలలో తన ప్రాధాన్యతను తెలుపుతూనే ఉంది. కాబట్టే, స్త్రీ లేని సమాజాన్ని ఊహించలేము. నాడు 'కన్యాశుల్కం' పేరిట, నేడు 'వరకట్నం' పేరిట అబలలపై అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి.**

నాడు దేవదాసి, జోగినీలుగా దుర్భర జీవితం గడిపితే, నేడు ఆధునిక పరిజ్ఞానంతో "హైటెక్ వ్యభిచారులు" గా మారుతున్నారు. స్త్రీల జీవితంలో మార్పు రావాలి అంటే నైతికంగా ముందు మారాలి. తాను ఫ్యాషన్ షోల పేరిట అంగాంగ ప్రదర్శనలు ఇస్తున్న విషయాన్ని గుర్తించి, ఆ ప్రదర్శనలు తన ఉనికికే ప్రమాదకరమని ప్రతి స్త్రీ గుర్తించాలి. ఈ ప్రదర్శనలలో తాను పురుషులను ఆహ్లాదపరిచే అంగడి బొమ్మగా మారుతున్న వైనాన్ని గ్రహించ గలగాలి. ఉన్నత విద్యను అభ్యసించటమే కాదు, ఉన్నతమైన ఆలోచనలు ఉండాలి.

భ్రూణ (ఆడ) హత్యలకు పాల్పడుతున్న వారిలో, తన లాంటి ఒక ఆడది (ఆడ శిశువు)కు జన్మనిస్తున్నందుకు గర్వపడాలి. నేటి స్త్రీలు హక్కులతోపాటు బాధ్యతలు కూడా గుర్తించగలగాలి. కట్నం రూపంలో వెల చెల్లించి కొన్న భర్త చేతుల్లో తానే ఒక మరబొమ్మగా మారటాన్ని, ఒక్కోసారి వరకట్న దాహానికి తానే 'బలి' అవుతున్న ఎందరో అబలలు మనకు కనబడుతుంటారు. చదువు కోసం వచ్చిన ఆడపిల్లలను హాస్టల్ గదిలోనే హత్యచేస్తున్న 'ఆయెషా మీరా' లాంటి ఉదంతాలు, ప్రేమ పేరున శ్రీ లక్ష్మిని పట్టపగలు క్లాస్‌రూంలో కిరాతకంగా హత్య ఘటనలు. ఇవేగాక, 'నిర్భయ' చట్టం వచ్చినా నిర్భయంగా అత్యాచారాలు పెరిగిపోతున్న నేటి సమాజంలో స్త్రీల జీవనమే ఒక ప్రశ్నగా బాధిస్తూనే ఉంది. నాడు స్త్రీ నాలుగు గోడల మధ్య మూగగా రోదిస్తూ జీవితం గడిపితే, నేడు బహిరంగంగా బాధించబడుతోంది. తల్లి ప్రేమకు ప్రతి రూపం. అటువంటి తల్లి రూపం కూడా నేడు వికృతంగా మారుతున్న వైనం సమాజాన్ని అధోస్థితికి దిగజార్చే విధంగా ఉంది. త్యాగమూర్తి అయిన స్త్రీ తన సంతానామే తనకు శాపంగా భావించి, ముండ్ల కంపలలో, చెత్తకుండీలలో పసికందులను వదలి వేస్తున్న దృశ్యాలు.

పిల్లలు భవిష్యత్తుకు ర్యాంకులు, గ్రేడులే కాదు, ఉత్తమ నైతికత అవసరం అని చెప్పేవారే కరువయ్యారు. నిండైన వస్త్ర ధారణ హుందాతనానికి, నాగరికతకు గుర్తుగా పురుషులు భావిస్తూ అలాంటి వస్త్రధారణకే అధిక ప్రాధాన్య ఇస్తూ ప్రతి ముఖ్య

కార్యక్రమాల్లో పాల్గొంటూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. పురుషులను అలరించటమే తమ అందానికి గుర్తింపుగా, అరకొర దుస్తులతో అగుపిస్తున్నది నారీలోకం. ఈ విధమైన మానసిక మార్పును స్త్రీలలో కలిగించటానికి పురు షులు స్త్రీ స్వేచ్ఛ, స్త్రీ సమానత్వం పేరిట మోసగిస్తూనే ఉన్నారు. తాను ఒక అలరించే వస్తువుగా మారుతున్న వైనాన్ని గుర్తించలేని వెర్రితనంతో బ్రతుకుతూ ఉంది నేటి మహిళ. అందుకనే అటు ఆర్థికంగాను, ఇటు శారీరకంగాను దోచుకోబడుతూనే ఉంది.

'సరోగసి' అంటే తల్లి తన గర్భాశయాన్ని కొన్ని నెలలు అద్దెకిచ్చి బిడ్డను కనిచ్చి ఒక యంత్రంగా మారటం, అత్యంత అమూల్య మైన తల్లి బంధమే వ్యాపార బంధంగా మారితే, ఇక భార్యాభర్తల బంధం గురించి ఏమని ఆలోచించాలి? స్త్రీల నైతికతే సమాజ ఉన్నతికి పునాది. స్త్రీల సౌశీల్యతపైన సమాజఉన్నతి చాలా వరకు ఆధారపడి ఉంది. సమాజానికి కావాల్సిన ఉత్తమ పౌరులను తయారు చెయ్యటంలో తల్లి పాత్ర అద్వితీయం. స్త్రీ తన శక్తియుక్తులన్నీ పిల్లల పెంపకంలో, వారి ఉన్నతికే ఆలోచించిన నాడు ఉత్తమ సమాజ నిర్మాణం జరుగు తుంది.

సతీసహగమనం, స్త్రీల పునర్వివాహానికి తోడ్పడిన సంఘ సంస్కర్తలు కందుకూరి వీరేశలింగం గారు, రాజా రాంమోహన్ రాయ్‌లాంటి వారు మనకు తెలుసు. కానీ నేటికి 14వందల సంవత్సరాలకు పూర్వమే వితంతువును, తన నిండు యవ్వనంలో వివాహమాడిన సంస్కర్త ముహమ్మద్ (స). ఈయన (స) అత్యంత ధనికురాలుగా పేరుపొందిన మహిళా వ్యాపారవేత్తగా గుర్తించ బడిన ఖదీజ (ర. అన్హా) అనే మహిళను, తన కంటే 15 సం.లు పెద్దదైన స్త్రీని వివాహమాడారు. బేటీ బచావో, బేటీ పడావో అంటూ ఉన్న నినాదాలు నేడు మనం వింటున్నాం. విద్యను అభ్యసించటం స్త్రీ పురుషుల బాధ్యత అంటూ స్త్రీల విద్యను ప్రోత్సహించిన ధర్మం ఇస్లాం. ఏ విషయంలోనూ ఆడపిల్లను తక్కువగా చూడరాదని, మగ పిల్లవాడిని అధికుడిగా చూడరా దని, ఇద్దరి పట్ల సమాన ప్రేమను చూపించాలని తెలిపిన ధర్మం ఇస్లాం. ప్రవక్త (స) ఇలా అన్నారు: "ముగ్గురు కుమార్తెలను లేక ముగ్గురు అక్కచెల్లెళ్ళను పెంచి, వారికి విద్యా బుద్ధులు, సభ్యతా సంస్కారాలు నేర్పించి, వారి పట్ల జాలి, దయాభావం కలిగిన వ్యక్తి అవసరాలన్నిటికి దేవుడు తీరుస్తాడు. అటువంటి వ్యక్తికి దేవుడు స్వర్గప్రాప్తి విధిగా లభింపజేస్తాడు. అప్పుడు ఒకరు అన్నారు "ఒకవేళ ఇద్దరే అయితే?" అని. అప్పుడు ప్రవక్త(స) అన్నారు: "ఇద్దరు అమ్మాయిలను పోషిస్తే కూడా ఈ ప్రతిఫలం లభిస్తుంది". హజ్రత్ ఇబ్నె అబ్బాస్ అంటారు, "ఒకవేళ ప్రజలు ఒక అమ్మాయి పోషణ విషయం అడిగినా, ఆయన(స) ఇదే శుభవార్త వినిపించే వారు" అని. అమ్మాయి అయినా, అబ్బాయి అయినా దేవుని బహుమానంగా భావించాలి. స్త్రీలను ఆస్తి హక్కును 1400 సం.కు పూర్వమే ప్రసాదించిన దైవధర్మం ఇదే. దుర్మార్గుడైన, కర్కశు డైన భర్త నుండి 'ఖులా' అనే ప్రక్రియ ద్వారా విడిపోయి తనకు తానుగా జీవించే హక్కును కలిగియుండుటయే కాదు, పునర్వివాహం చేసుకోవచ్చని తెలిపిన ఆధునిక ధర్మం ఇదే. ఇస్లాంకు పూర్వం బంగారం, వెండి, వజ్రాలు, అధికారం, హెూదా ఎలా ఆస్తులుగా భావించేవారో అలాగే లెక్కలేనంత మంది స్త్రీలను వివాహమాడటం తమ గౌరవంగా భావించేవారు. స్త్రీలను తమ ఆస్తులుగా పరిగణించేవారికి స్త్రీయే సహధర్మచారిణి అని, మీరు తిన్నదే ఆమెకు తినిపించండి, వారికి సమానమైన ప్రాధాన్యత, గౌరవ మర్యాదలు ఇవ్వాలని బోధించిన ధర్మం ఇస్లాం. అంతేకాక వివాహాలకు పరిమితి విధించింది. పురుషునికి వ్యభిచారం నుండి కాపాడటానికి 'బహు భార్యత్వాన్ని ధర్మసమ్మతం చేసింది. అలాగే స్త్రీల పునర్వివాహాన్ని అనుమతిస్తూ అక్రమ సంబంధాలకు అడ్డుకట్ట వేసిన ధర్మం ఇస్లాం. సమానత్వం, న్యాయశీలత కలిగి పరస్పరం ఒకరి పట్ల మరొకరు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించాలని బోధించిన దైవధర్మం ఇదే. పరదా ప్రగతికి ప్రతిబంధకం కాదు అంటూ బోధించిన ధర్మం. సమాజంలోని అత్యాచారాలకు స్త్రీల వస్త్రధారణ కూడా ఒక కారణం కాబట్టే స్త్రీల నిండైన వస్త్రధార ణకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చిన ధర్మం.

స్త్రీల అణచివేత అన్నది నిజమే అయితే యూరప్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, ఇలా పూర్తి ప్రపంచంలో ఉన్నత విద్యను ఆర్జించిన యువకులు ఎందుకు పెద్ద సంఖ్యలో ఇస్లాం స్వీకరిస్తు న్నారు? స్త్రీ పురుషులకు వివిధ రంగాలను ఆపాదించి సమ న్యాయం చేకూర్చిన ధర్మం. ధర్మ గ్రంథ బోధనలను ప్రవక్త (స) బోధించి ఆచరించి చూపారు. వివాహంలో 'మహర్' అనే స్త్రీ ధనాన్ని విధిగా చెల్లించాలని, విడాకుల ప్రక్రియ ఆఖరి అస్త్రంగా మాత్రమే ఉపయోగించాలని, ఇది దైవానికి అత్యంత అయిష్టకరమయిన పనిగా తెలిపిన ధర్మం. విశాల దృక్పథంతో ఆలోచించినట్లయితే స్త్రీల భద్రతకు ప్రవక్త(స) ఆచరించి చూపిన విధానం తప్ప వేరే గత్యంతరం లేదు. ఒక నిర్ణీత కట్టుబాట్లకు, నైతిక సంస్కరణలకు తోడ్పడే విధంగా స్త్రీ మానసిక ఆలోచనలను క్రమబద్ధీకరించి సమాజ అభి వృద్ధికి స్త్రీల తోడ్పాటు అవసరాన్ని నొక్కి చెప్పిన ధర్మం ఇస్లాం. ✻

# ఒక్క బియ్యం గింజతో...

- ముహమ్మద్ వహీదుద్దీన్

**యూసుఫ్** ఎంతో తెలివితేటలు గల వ్యక్తి. విద్వాంసుడు, జ్ఞాని. ఒకరోజు ఆయన రాజ హసన్‌ఖాన్‌ను కలవడానికి వారి రాజధాని అయిన ముస్‌ఖానాబాద్ చేరుకున్నాడు. రాజు జ్ఞానవంతుల్ని, విద్వాంసుల్ని గౌరవించి సత్కరిస్తాడని విని యున్నాడు. యూసుఫ్ రాజు దగ్గరికి వెళ్ళగానే రాజు గారు ఎంతో మర్యాదగా రాజదర్బారుకు తీసుకువెళ్ళి మంత్రుల ప్రక్కన కూర్చొబెట్టాడు. సమావేశం ముగిసిన తర్వాత రాజు యూసుఫ్‌ను మంచి కవితను వినిపించాలని కోరాడు. అతను అలాగే చేశాడు. ఆ కవిత రాజు గారికి ఎంతో నచ్చింది. ఎంతో సంతోషించాడు. బహుమతి కోరుకొమ్మని అన్నాడు.

రాజుకు చదరంగం ఆట అంటే ఎంతో ఇష్టం. ప్రతి రోజు చదరంగం తన మంత్రులతో ఆడేవాడు. విచ్చలవిడిగా డబ్బులను, బంగారంతో తయారుచేసిన వస్తువులను ఇచ్చేవాడు. రాత్రంతా ఆటలో మునిగి తేలేవాడు. చాలా విషయాలు పట్టించుకునేవాడు కాదు. నిర్లక్ష్యం చేసేవాడు.

యూసుఫ్ రాజు ఎదుట ఉంచబడిన చదరంగం బల్ల వైపు చూస్తూ అన్నాడు. 'మహరాజా! మీరు బియ్యం ఒక గింజ ఆ చదరపు బల్ల మొదటి గడిలో పెట్టాలి. రెండవ గడిలో మొదటి దానికి రెండింతలు పెట్టాలి. అలా ఒక్కో గడిలో పెట్టి చివరకు ఇచ్చింది నా బహుమతిగా భావిస్తాను.

రాజు గారు మాట్లాడుతూ నీవు వజ్రాలో, బంగారం, వెండి పెద్ద మొత్తంలో డబ్బులు అడుగుతావు అనుకున్నాను. కాని నీవు మాత్రం బియ్యం గింజల్ని అడిగావు. అంతేనా అని రాజు వ్యంగ్యంగా నవ్వుకుంటూ మాట్లాడాడు.

సరే. అయితే నీవు కోరినదే జరిగి తీరుతుంది. రాజు సేవకునికి ఆదేశమిచ్చారు. ఫలానా గోదాములో ఉన్న బియ్యం సంచిని తీసుకురావాలని చెప్పారు. సేవకులు అలానే చేశారు.

మొదటి గడిలో ఒక గింజ, రెండవ గడిలో రెండు గింజలు, మూడవ గడిలో 4 గింజలు, 5వ గడిలో 16 గింజలు ఇలా సగం చదరపు గడియలు వచ్చేసరికి 214 కోట్లపైన గింజలు అయ్యాయి. రాజు గారు ఆందోళనగా అలాగే చూస్తూ ఉండి పోయాడు.

చివరకు ఎలాంటి స్థితి ఏర్పడిందంటే మహరాజు దగ్గర తన కోశాగారంలో ఉన్న బియ్యం మొత్తం ఆయనకు అప్పగించటం తప్ప వేరే మార్గం కనపడలేదు.

అప్పుడే యూసుఫ్ వారిని ఆపి అన్నాడు : మహరాజా! నేను మీ నుండి ఏమీ కోరుకోవట్లేదు. నేను కేవలం మీకు ఏమి చూపు దామనుకున్నానంటే చిన్న చిన్న వస్తువులు కూడా ఎంతో విలువైనవి అవుతాయి.

ఈ మాటలు విని మహరాజు గారు ఎంతో సంతోషించారు. చిరునవ్వులు నవ్వారు. లేచి నిలబడి చప్పట్లు కొట్టారు.

యూసుఫ్...! నీవు ఒక్క బియ్యం గింజతో జీవితం గొప్పతనం అర్థం అయ్యేటట్లు కళ్ళకు కట్టినట్లు చెప్పావు.

మహారాజు వెంటనే యూసుఫ్‌ను ఘనంగా సన్మానించటంతో పాటు తన మంత్రివర్గంలో ఒకరిగా చేర్చుకున్నారు. ఆర్థిక శాఖ బాధ్యతను అప్పగించారు.

యూసుఫ్ అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటూ సాష్టాంగంలో పడిపోయాడు. శతకోటి వందనాలు అర్పించుకున్నాడు.

ఆర్థిక సమస్యలతో విలవిలలాడుతున్న ఆ రాజ్యాన్ని అగ్రగామిగా చేశాడు. తన తోటి మంత్రులను కూడా పరుగెత్తించాడు అభివృద్ధి వైపు.

రాజు కూడా ప్రజలు చెప్పిన ఏ చిన్న సమస్యలు ఉన్నా ఎప్పటికప్పుడు పరిష్కరించేవాడు. కొన్ని సంవత్సరాల్లోనే ఆ రాజ్యం మూడు పువ్వులు ఆరు కాయలుగా మారిపోయింది.

అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటూ రాజ హసన్‌ఖాన్ పరిపాలనను ముందుకు సాగించాడు.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**